

# జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 311 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 13, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# ప్రపంచ దేశాలు.. స్పందించాలి !

దేశంలో ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలుగుతోందని డాక్టర్ బరిగెల శివ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రజల హక్కులను కాలరాస్తున్నాయని ఆయన విమర్శించారు. ఢిల్లీలో అక్టోబర్ 10న జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో విద్యార్థులు, మేధావులు, ఉద్యమకారులు పాల్గొన్నారని తెలిపారు. ఆందోళనకారులపై దాడులు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మహిళా విద్యార్థులపై దాడులు జరిగాయన్న ఆరోపణలను తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఎన్నికల సంఘం పనితీరు, ఫారం-6 వినియోగంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, కేంద్ర ప్రభుత్వ పాత్రపై ఆయన చేసిన ఆరోపణలకు సంబంధించి పారదర్శక విచారణ అవసరమని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు ప్రపంచ దేశాలు స్పందించాలని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

8

మోడీ అరాచకాలను అరికట్టాలి

దేశంలో జరుగుతున్న కిరాయి గుండాలదాడికి బాధ్యులు ఎవరు

ఫారం 6కు అనుమతులు ఎక్కడ లభించాయి

ఆర్ఎస్ఎస్ గుండాల దాడులు కేంద్ర ప్రభుత్వం చేయిస్తున్నవే

జాతీయ ఎన్నికల సంఘం దేశం వైపా బిజెపి వైపా

జాతీయ ఎన్నికల కమిషన్ పై భగ్గుమంటున్న దేశ ప్రజలు

ప్రపంచ దేశాలన్నీ భారతదేశ పాలనను ప్రశ్నించాలి

జ్ఞానేష్ కుమార్ ను ప్రశ్నిస్తే బిజెపికి ఎందుకింత మంట కలుగుతుంది

తప్పులు జరగనప్పుడు కేంద్ర ప్రభుత్వం శ్వేత పత్రం ఎందుకు విడుదల చేయడం లేదు

ప్రజలను వేధిస్తూ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడం బిజెపికి కొత్తెం కాదు

భేటీ పడావో బేటి బచావో అంటే విద్యార్థినిలపై పిడి దెబ్బల దాడి చేయడమా

మత రాజకీయాలు ఇంకింతకాలం

దేశాన్ని నాశనం చేస్తున్న దరిద్రపు పాలనను అంతం చేయాల్సిందే

మోడీ క్రూరత్వాన్ని దేశంపై చూపిస్తున్నాడు

ప్రజల ఉసురు పోసుకుంటే పాపం తాకదా

ముసలోళ్ల రాజ్యంలో మునిగిపోతున్న దేశం

డాక్టర్ బరిగెల శివ




## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి!

ఢిల్లీలో తెలంగాణ ప్రజాప్రతినిధుల నిరసన

బరాఖంబా మెట్రో స్టేషన్ వద్ద ఆందోళన

నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఎన్నికల సంఘం పనితీరుపై నేతల అసంతృప్తి

ప్రజాస్వామ్య విలువలు, పారదర్శకతపై చర్చ

2






## ఉప్పల్‌లో క్రికెట్ సమరం.. భద్రతా వలయంలో స్టేడియం!

భారత్-వెస్టిండీస్ టీ20 మ్యాచ్‌కు భారీ బందోబస్తు

2,200 మంది పోలీసులతో పటిష్ఠ భద్రత

408 సీసీటీవీ కెమెరాలు.. డ్రోన్లతో నిరంతర నిఘా

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

ప్రేక్షకుల భద్రతకు ప్రత్యేక విభాగాల రంగప్రవేశం

2

### వాట్సాప్‌లో NO అని రిప్లై ఇస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ అవుతుందా?

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్ పేరుతో హెచ్చరిక

గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే సందేశాలతో జాగ్రత్త

బ్యాంకు లావాదేవీలను అధికారిక యాప్‌లోనే పరిశీలించాలి

మోసానికి గురైతే 1930కు ఫోన్ చేయాలి

6

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలి!

ఓటర్ల జాబితాలో అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం

ఢిల్లీ నిరసనలో టీపీసీసీ నేత డా. పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్

ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతకు పట్టం కట్టాలి

ఓటు హక్కును పరిరక్షించడం ఎన్నికల సంఘం బాధ్యత

6



## ఉక్రెయిన్ యుద్ధంలో తెలంగాణ వాసి మృతి.. కుటుంబానికి అండగా రేవంత్ సర్కారు

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో జగిత్యాల వాసి సుదర్శన్ గౌడ్ మృతి

మృతుడి కుటుంబానికి రూ. 6 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన సీఎం రేవంత్

ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లిన బాధితుడు

మృతదేహాన్ని స్వదేశానికి తెచ్చేందుకు అధికారులకు ఆదేశాలు

6



# గిరిజన దర్బార్‌లో ప్రజల సమస్యలు తెలుసుకున్న ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

**ఏటూరునాగారం, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్)**

ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గిరిజన దర్బార్‌లో వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 7 దరఖాస్తులు అందాయి. ఇందులో ఆర్‌సీఓ, మహబూబాబాద్‌కు సంబంధించి మూడు దరఖాస్తులు ఉన్నాయి. వీటిలో ఉద్యోగానికి సంబంధించిన ఒక దరఖాస్తు, డిప్యూటేషన్‌కు సంబంధించిన మరో దరఖాస్తు, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా భార్య పనిచేస్తున్న పాఠశాలకు బదిలీ చేయాలని కోరుతూ మరో దరఖాస్తు ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలం అఖినేపల్లి మల్లారం ప్రాంతంలో గిరిజన, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, భూముల బదలాయింపులు, మ్యుటేషన్లపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మరో దరఖాస్తు అందింది. పస్రా గ్రామపంచాయతీ పరిధిలోని 18 గదుల తాయ్ బజార్ అంగడిపేట షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణను ఐటీడీఏ పరిధిలోకి తీసుకోవాలని నేషనల్ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం ప్రతినిధులు దరఖాస్తు సమర్పించారు. అలాగే పస్రా గ్రామపంచాయతీ పరిధిలోని 13 గదుల షాపింగ్ కాంప్లెక్స్‌లో గిరిజనులకు దుకాణాల కేటాయింపు సమయంలో అడ్వాన్స్ డిపాజిట్‌కు అదనంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించాలని కోరుతూ మరో దరఖాస్తు సమర్పించారు. అదేవిధంగా మంగపేట మండలంలోని ఆదివాసీ విద్యార్థులకు సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏజెన్సీ ధ్రువపత్రాలు మంజూరు చేయాలని కోరుతూ మరో దరఖాస్తు అందింది. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించే ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతతో పరిశీలించాలని సూచించారు. నిబంధనల మేరకు సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జి. ప్రతాప్, డీడీ జనార్ధన్, ఈఈ ప్రవీణ్, ఏఓ ఏ. అనిల్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. కె. క్రాంతి కుమార్, ఆర్‌సీఓ పద్మిని తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఉప్పల్‌లో క్రికెట్ సమరం.. భద్రతా వలయంలో స్టేడియం!

**భారత్-వెస్టిండీస్ టీ20 మ్యాచ్‌కు భారీ బందోబస్తు**
**2,200 మంది పోలీసులతో పటిష్ఠ భద్రత**
**408 సీసీటీవీ కెమెరాలు.. డ్రోన్లతో నిరంతర నిఘా**
**ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ**
**ప్రేక్షకుల భద్రతకు ప్రత్యేక విభాగాల రంగప్రవేశం**




**హైదరాబాద్, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్):**

క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్–వెస్టిండీస్ నాలుగో టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌కు ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సిద్ధమవుతోంది. అక్టోబర్ 14న రాత్రి 7 గంటలకు మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి రెడ్డి, ఐపీఎస్ ఆధ్వర్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా, ప్రేక్షకుల భద్రతకు సంబంధించి సమగ్ర కార్యాచరణ రూపొందించారు. మ్యాచ్ నిర్వహణ కోసం సుమారు 2,200 మంది పోలీసు సిబ్బందిని విధుల్లో నియమించనున్నట్లు సమాచారం. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలతో పాటు షీ టీమ్స్, బాంబ్ డిటెక్షన్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ తదితర ప్రత్యేక విభాగాలు భద్రతా విధుల్లో పాల్గొననున్నాయి. స్టేడియం ప్రవేశ ద్వారాలు, ప్రేక్షకుల రాకపోకలు, పార్కింగ్ ప్రాంతాలు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు, నిఘా కొనసాగించనున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ స్టేడియం పరిసరాల్లోని 408 సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. జనసమ్మర్ధం అధికంగా ఉండే ప్రాంతాలు, ప్రధాన రహదారులు, ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అవసరమైన చోట డ్రోన్ల ద్వారా గగనతల నిఘా నిర్వహించి, అనుమానాస్పద పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించేలా పోలీసు బృందాలను అప్రమత్తంగా ఉంచనున్నారు. మ్యాచ్ సందర్భంగా ఉప్పల్ పరిసరాల్లో వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయనున్నారు. స్టేడియానికి చేరుకునే మార్గాలు, వాహనాల పార్కింగ్, మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రేక్షకుల తిరుగు ప్రయాణంపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించనున్నారు. ప్రేక్షకులు ముందుగానే స్టేడియానికి చేరుకోవాలని, పోలీసుల సూచనలు పాటిస్తూ భద్రతా తనిఖీలకు సహకరించాలని అధికారులు సూచిస్తున్నారు. నిషేధిత వస్తువులను స్టేడియంలోకి తీసుకురావద్దని కోరుతున్నారు. మహిళలు, పిల్లలు, కుటుంబాలతో వచ్చే అభిమానుల భద్రతకు కూడా ప్రాధాన్యమివ్వనున్నారు. మ్యాచ్ ప్రారంభానికి ముందే ముమ్మరమయ్యే బందోబస్తు, మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రేక్షకులంతా స్టేడియం నుంచి బయటకు వెళ్లే వరకు కొనసాగనుంది. అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ను ప్రశాంతంగా నిర్వహించడం, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యంగా సంబంధిత పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయనున్నాయి.

# వాతావరణ మార్పులపై అలర్ట్.. రైతులకు అధికారుల కీలక సూచనలు

**వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా**
**పంటల సాగు ప్రణాళిక చేసుకోవాలి**



**హసన్‌పర్తి, 12 అక్టోబర్ 2026 ( జై భీమ్ న్యూస్)**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. హసన్‌పర్తి మండలం మడిపల్లి రైతు వేదికలో సోమవారం రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల వ్యవసాయ రంగంపై కలిగే ప్రభావాలు, పంటల సాగులో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల రుతుపవన వర్షపాతంలో మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. 2026లో ఎల్‌నినో పరిస్థితులు బలపడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళికను రూపొందించుకోవాలని తెలిపారు. వర్షపాతం తగ్గినట్లయితే వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటల సాగు, దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు వివరించారు. నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, తక్కువ నీటితో సాగు చేయగల పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి ఆధారంగా సాగు నిర్ణయాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, నేలలో తేమను కాపాడేందుకు పంట అవశేషాలతో మల్చింగ్ చేయాలని తెలిపారు. ఎరువులు, పురుగుమందులను వ్యవసాయ నిపుణుల సూచనల మేరకే వినియోగించాలని సూచించారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టడం ద్వారా పంట నష్టాలను కొంతవరకు నివారించుకోవచ్చని అధికారులు తెలిపారు. నీటి వనరుల సంరక్షణతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై కూడా రైతులు దృష్టి సారించాలని సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారుల సూచనలు తీసుకుని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులను అవలంబించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, మండల స్పెషల్ ఆఫీసర్ బి. మోహన్, సహాయ వ్యవసాయ సంచాలకులు ఆదిరెడ్డి, ఎంపీడీఓ సుమన వాణి, జిపిఓ రమాదేవి, మండల వ్యవసాయ అధికారి అనురాధ, మండల పశు వైద్యాధికారి మైతిలి, ఉద్యానవన శాఖ అధికారి సుష్మిత, మడిపల్లి గ్రామ సర్పంచ్ బుర్ర రంజిత్ కుమార్, జయగిరి గ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్‌లు కాందారి ప్రదీప్ కుమార్, అరుణ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు సుమన్, సాయి, పీఏసీఎస్ డైరెక్టర్ గాదం శ్రీధర్, మాచర్ల మహేందర్, జంపాల రమేష్, మాచర్ల వెంకటేష్, బుర్ర రవీందర్, ముంజ రవి, సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**హన్మకొండ, అక్టోబర్ 12, 2026 (జై భీమ్ న్యూస్)**



తెలంగాణ ప్రభుత్వం
మహిళా శిశు వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, హనుమకొండ జిల్లా
పత్రికా ప్రకటన
తేదీ:12-10-2026

అంగన్వాడీ టీచర్ పోస్టులకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

హనుమకొండ జిల్లాలోని, మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖ పరిధిలో గల (03) ఐ.సి.డి.యస్ పరిధిలోని (55) ఖాళీగా ఉన్న అంగన్ వాడి టీచర్ల పోస్టులు భర్తీ చేయడానికి మహిళ అభ్యర్థినుల నుండి ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఇట్టి దరఖాస్తుదారుల యొక్క ఒరిజినల్ సర్టిఫికేట్ ల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రాజెక్టుల వారీగా క్రింద తెలిపిన తేదీలలో జరుపబడును.

| క్ర. సం. | ప్రాజెక్టు పేరు | వెరిఫికేషన్ తేదీలు | వెరిఫికేషన్ జరుగు స్థలం | సమయం |
|---|---|---|---|---|
| 1 | హనుమకొండ | 13-10-2026 నుండి 15-10-2026 వరకు మరియు 23-10-2026 నుండి 29-10-2026 వరకు | సి. డి. పి. ఓ., ఐ.సి.డి.యస్ ప్రాజెక్టు హనుమకొండ | ఉదయం గం. 10.30 ల నుండి సాయంత్రం గం. 05.00 ల వరకు |
| 2 | భీమదేవరపల్లి | 13-10-2026 నుండి 15-10-2026 వరకు మరియు 23-10-2026 నుండి 27-10-2026 వరకు | సి. డి. పి. ఓ., ఐ.సి.డి.యస్ ప్రాజెక్టు భీమదేవరపల్లి | ఉదయం గం. 10.30 ల నుండి సాయంత్రం గం. 05.00 ల వరకు |
| 3 | పరకాల | 13-10-2026 నుండి 15-10-2026 వరకు మరియు 23-10-2026 నుండి 26-10-2026 వరకు | సి. డి. పి. ఓ., ఐ.సి.డి.యస్ ప్రాజెక్టు పరకాల | ఉదయం గం. 10.30 ల నుండి సాయంత్రం గం. 05.00 ల వరకు |

అభ్యర్థులకు గమనిక: 25-10-2026 న ఆదివారం కావడం వలన సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరగదు.

అభ్యర్థులు తప్పనిసరిగా తమ ఒరిజినల్ సర్టిఫికేట్ లను వెరిఫికేషన్ రోజున తప్పక సమర్పించవలెను. వీటితో పాటు ఆన్లైన్ లో అప్లోడ్ చేసిన అన్నీ సర్టిఫికేట్ లను గెజిటెడ్ అధికారి చే అటెస్టేషన్ చేయించిన (02) జతల నకలు ప్రతులను సమర్పించవలెను.

సి.డి.పి.ఓ. కార్యాలయములలో సర్టిఫికేట్ వెరిఫికేషన్ కు సంబంధించిన పూర్తి వివరములు నోటీస్ బోర్డు ల యందు ఉంచబడుతాయి మరియు ప్రతి అభ్యర్థికి సర్టిఫికేట్ వెరిఫికేషన్ కు హాజరు కావలసిన సమయం వంటి వివరములు ఒక రోజు ముందుగానే టెలిఫోన్ ద్వారా సమాచారం ఇవ్వబడునని తెలియజేయడమైనది.

ఈ సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియ ను పూర్తిగా రద్దు పరచటానికి గానీ, మార్పులు చేయడానికి గానీ జిల్లా కలెక్టర్ గారికి పూర్తి అధికారం కలదు.

జిల్లా సంక్షేమ అధికారి
హనుమకొండ జిల్లా

హనుమకొండ జిల్లాలో మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలోని మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టులలో ఖాళీగా ఉన్న 55 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న మహిళా అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను ఈ నెల 13వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ తెలిపారు. హనుమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టుకు సంబంధించి అక్టోబర్ 13 నుంచి 15 వరకు, అలాగే 23 నుంచి 29 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరగనుంది. భీమదేవరపల్లి ప్రాజెక్టుకు అక్టోబర్ 13 నుంచి 15 వరకు, అలాగే 23 నుంచి 27 వరకు, పరకాల ప్రాజెక్టుకు అక్టోబర్ 13 నుంచి 15 వరకు, అలాగే 23 నుంచి 26 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. హనుమకొండ, భీమదేవరపల్లి, పరకాల ఐసీడీఎస్ ప్రాజెక్టులకు చెందిన అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో ఆయా సీడీపీఓ కార్యాలయాల్లో హాజరుకావాల్సి ఉంటుంది. అభ్యర్థులు వెరిఫికేషన్ రోజున తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా సమర్పించాలి. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన అన్ని ధ్రువపత్రాలపై గెజిటెడ్ అధికారి చేత ధ్రువీకరించిన రెండు జతల నకలు ప్రతులను కూడా సమర్పించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. అక్టోబర్ 25న ఆదివారం కావడంతో ఆ రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించబడదని తెలిపారు. వెరిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఆయా సీడీపీఓ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి అభ్యర్థికి వెరిఫికేషన్‌కు హాజరుకావాల్సిన సమయం తదితర వివరాలను ఒక రోజు ముందుగానే ఫోన్ ద్వారా తెలియజేస్తామని తెలిపారు. అవసరమైన పరిస్థితుల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేయడం లేదా తేదీల్లో మార్పులు చేయడం వంటి అధికారాలు హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు ఉన్నాయని జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ తెలిపారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి!

**ఢిల్లీలో తెలంగాణ ప్రజాప్రతినిధుల నిరసన**
**బరాఖంబా మెట్రో స్టేషన్ వద్ద ఆందోళన**
**నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**
**ఎన్నికల సంఘం పనితీరుపై నేతల అసంతృప్తి**
**ప్రజాస్వామ్య విలువలు, పారదర్శకతపై చర్చ**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్):**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రజాప్రతినిధులు దేశ రాజధాని ఢిల్లీలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఢిల్లీలోని బరాఖంబా మెట్రో స్టేషన్ వద్ద నిర్వహించిన ఈ ఆందోళనలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు ఈ కార్యక్రమంలో పాల్గొని సీఈసీ రాజీనామా చేయాలనే డిమాండ్‌కు మద్దతు తెలిపారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడం, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టడం ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యతలని ఈ సందర్భంగా నేతలు ప్రస్తావించారు. ఎన్నికల సంఘం పనితీరుపై తమ అసంతృప్తిని నిరసన రూపంలో వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఎన్నికల సంఘం నిష్పాక్షికత వంటి అంశాలు ఈ ఆందోళనలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలంగాణ ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చి ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాను డిమాండ్ చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అయితే, నిరసనకు దారితీసిన నిర్దిష్ట కారణాలు, నేతలు చేసిన ఇతర వ్యాఖ్యలు, తదుపరి కార్యాచరణకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

# ఎడారి దేశంలో పూల జాతర.. దుబాయ్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకైన బతుకమ్మ పండుగ దుబాయ్ వేదికగా ఘనంగా జరిగింది. సంస్థల ఆధ్వర్యంలో ఒకే రోజు రెండు వేదికల్లో (శబాబ్ అల్ అహ్లీ స్పోర్ట్స్ క్లబ్, అమిటీ స్కూల్) జరిగిన ఈ వేడుకలకు ప్రవాస తెలంగాణవాసులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్ రెడ్డి, బిగాల గణేష్ గుప్తా, జాజాల సురేందర్, షకీల్ అహ్మద్, బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల తదితరులతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం ఈ సంబరాల్లో పాల్గొని ప్రవాస తెలంగాణ బిడ్డలతో కలిసి సందడి చేసింది. పండుగ ఉత్సాహం మధ్య గల్ఫ్ ఎన్నారైలు, కార్మికుల నుంచి "కేసీఆర్ మళ్లీ రావాలి" అనే నినాదాలతో దుబాయ్ నగరం మార్మోగింది.

# మంజూరు ఉంది.. స్థలం లేదు!


గౌరవనీయులైన హనుమకొండ జిల్లా కలెక్టర్ గారికి నమస్కరించి వ్రాయునది.
అర్యా!
విషయం:
1 హసన్ పర్తి మండల కేంద్రమునకు మంజూరైన విద్యుత్ సబ్ స్టేషన్ కు ప్రభుత్వ భూమిని కేటాయించుట గురించి.
2 హసన్ పర్తి మండల కేంద్రానికి ఒక లైన్ మెన్, ఒక సహాయ లైన్ మెన్, ఒక హెల్పర్ ను కేటాయించుట గురించి.
మీకు తెలియజేయునది ఏమనగా,
మేము హసన్ పర్తి గ్రామస్థులము మరియు రైతులము మాకు సుమారు నాలుగున్నర సంవత్సరాల క్రితం హసన్ పర్తి గ్రామమునకు విద్యుత్ ఓవర్ లోడ్ వలన ప్రజలు పడుతున్న బాధలు నివారించుటకు విద్యుత్ సబ్ స్టేషన్ ను మంజూరు చేసారు. సబ్ స్టేషన్ కు స్థలం కేటాయింపులో జాప్యం జరిగినది. మూడు సంవత్సరాల క్రితం జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమంలో సబ్ స్టేషన్ నిర్మాణమునకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని అప్పటి RDO హనుమకొండ గార్లను మరియు హసన్ పర్తి తహశీల్దార్ గారిని అడుగగా హసన్ పర్తి లో గల మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయము (చౌదరి కుంట) ఆవరణలో గల స్థలంను కేటాయిస్తున్నట్లు అప్పటి RDO, MRO ప్రకటించారు. విద్యుత్ అధికారులకు చూపించారు. దానిని technical గా పరిశీలించగా బండ ఉన్నందున సబ్ స్టేషన్ కు earth పాస్ అవ్వక విద్యుత్ సరఫరా అవ్వదు అన్నారు. తిరిగి గత ఆగస్టు నెలలో సబ్ స్టేషన్ కు తహశీల్దార్ గారు హసన్ పర్తి గార్లు సంస్కృతి విహార్ లో గల sbi ప్రక్కన చూపించారు. అక్కడ కూడా సహజంగా రాయిలు ఉన్నాయని ఆ స్థలం విద్యుత్ సబ్ స్టేషన్ కు ఉపయోగపడదు అని విద్యుత్ అధికారులు అన్నారు. మండల కేంద్రం అయిన హసన్ పర్తి లో సుమారు 300 TRANSFORMER లు కలవు. దాదాపు 8000 ల గృహ వినియోగ, వాణిజ్య వినియోగ కనెక్షన్ లు ఉన్నాయి. దాదాపు 200 వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ లు ఉన్నాయి. Private college లు, TGRJC, పలు ప్రభుత్వ పాఠశాలలు కలవు. ప్రతి రోజు ఏదో ఒక చోట విద్యుత్ ఓవర్ లోడ్ వలన TRANSFORMER లు దెబ్బ తినటం, ఫ్యూజ్ లు పోవటంతో సరఫరా ఆగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
హసన్ పర్తి మండల కేంద్రానికి దాదాపు 2 సంవత్సరాలుగా విద్యుత్ లైన్ మెన్ లేడు. దీనితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఒక ALM, HELPER ను కేటాయించగలరని మనవి. కావున తమరు మా ప్రజల విజ్ఞప్తిని మన్నించి, పరిశీలించి హసన్ పర్తి మండల కేంద్రం లో గల సంస్కృతి విహార్ లో వేరొక చోట, 20 గుంటల స్థలాన్ని కేటాయించి ప్రజలకు, రైతులకు సౌకర్యం కల్పించగలరని మనవి.
ఇట్లు
హసన్ పర్తి గ్రామస్థులు, రైతులు
DISTRICT GRIEVANCE CELL Government of Telangana District: HANUMAKONDA Sl. No: Dated: Department: For taking appropriate action and
RDO HNK 12/10/26
1. SS Communication M. Srikanth
ADITYA ENTERPRISES Electrical & Engineering Bus Stand, Hasanparthy-506 371

నాలుగున్నరేళ్లుగా హసన్‌పర్తి సబ్‌స్టేషన్‌కు గ్రహణం
ప్రభుత్వ భూమి కేటాయించి నిర్మాణ పనులు
చేపట్టాలి.. సిబ్బంది కొరతను తీర్చాలి

**హసన్‌పర్తి, 12 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండల కేంద్రంలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు సుమారు నాలుగున్నరేళ్ల క్రితం మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం స్థలం కేటాయింపులో జాప్యంతో ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. సబ్‌స్టేషన్ నిర్మాణానికి వెంటనే అనువైన ప్రభుత్వ భూమిని కేటాయించి పనులు ప్రారంభించాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన ప్రజలు, రైతులు, వ్యాపారులు సోమవారం హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో 8 వేలకు పైగా గృహ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు ఉండగా సుమారు 300 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని వారు తెలిపారు. విద్యుత్ వినియోగం పెరగడంతో అధిక లోడ్ కారణంగా తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతున్నాయని, ఫ్యూజులు పోవడం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వంటి సమస్యలతో ప్రజలు, రైతులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే మంజూరైన సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని కోరారు. సబ్‌స్టేషన్ కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని గతంలో ప్రజలు, రైతులు అధికారులను కోరగా, అప్పటి హనుమకొండ ఆర్డీఓ, హసన్‌పర్తి తహసీల్దార్ మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయ సముదాయంలో స్థలాన్ని చూపించినట్లు తెలిపారు. అయితే విద్యుత్ అధికారులు పరిశీలించగా అక్కడ బండరాయి ఉండటంతో ఎర్తింగ్ సమస్య తలెత్తే అవకాశం ఉందని, ఆ స్థలం సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనుకూలంగా లేదని పేర్కొన్నట్లు తెలిపారు. అనంతరం విద్యుత్ అధికారుల సూచన మేరకు సంస్కృతి విహార్‌లో ఎస్‌బీఐ బ్యాంకు పక్కన మరో స్థలాన్ని చూపించినప్పటికీ, అక్కడ కూడా పుట్ట సమీపంలో బండరాయి ఉండటంతో ఆ స్థలం కూడా అనుకూలంగా లేదని అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు. దీంతో స్థల ఎంపిక ప్రక్రియ ముందుకు సాగక సబ్‌స్టేషన్ నిర్మాణం నాలుగున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు మండల కేంద్రంలో సుమారు రెండేళ్లుగా విద్యుత్ లైన్‌మన్ లేకపోవడంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పెరిగిందని ప్రజలు తెలిపారు. అధిక లోడ్ కారణంగా ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్లకు రావడం, ఫ్యూజులు పోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని, దీంతో విద్యుత్ సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమించాల్సి వస్తోందని చెప్పారు. మండల కేంద్రానికి అదనంగా ఒక ఏఎల్‌ఎం, ఒక హెల్పర్‌ను కేటాయించడంతో పాటు పెంబర్తి గ్రామానికి కూడా ఒక హెల్పర్‌ను నియమించాలని కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనువైన ప్రభుత్వ భూమిని వెంటనే గుర్తించి కేటాయించాలని, నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రజలు, రైతులు, వ్యాపారులు విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో విద్యుత్ శాఖలో సిబ్బంది కొరతను పరిష్కరించి అవసరమైన లైన్‌మన్లు, ఏఎల్‌ఎంలు, హెల్పర్లను నియమించి మండల ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో వ్యాపారవేత్తలు దాడి శ్రీకాంత్ యాదవ్, గౌరిశెట్టి కృష్ణమూర్తి, హరీష్, పలువురు పాఠశాల కరస్పాండెంట్లు, రైతులు మారేపల్లి రామచంద్రారెడ్డి, వీసం కరుణాకర్‌రెడ్డి, మారేపల్లి జైపాల్‌రెడ్డి, వల్లాల గణేష్, తలకొక్కుల ఐలయ్య, జన్ను సురేష్, వేల్పుల రామయ్య, తోట చిన్న సారంగం తదితరులు పాల్గొన్నారు.


Citizen Copy
Government of Telangana
Hanumakonda District Prajavani Acknowledgment

| | | | |
|---|---|---|---|
| Grievance ID: | DHNKU12102600151 | Grievance Date: | 12-OCT-2026 |
| Citizen Name: | M RAMCHANDRA REDDY | Mobile No.: | 9849030633 |
| Gist of Grievance: | విద్యుత్ సబ్ స్టేషన్ కు ప్రభుత్వ భూమి, లైన్ మెన్,సహాయ లైన్ మెన్ అండ్ హెల్పర్ ను కేటాయించుట గురించి | | |

Your Grievance has been forwarded to the Revenue Divisional Office Hanumakonda for resolution.
Kindly note the Grievance ID for further reference.
This is a system-generated receipt. No signature required
"You can track the status using the above grievance ID on the Prajavani portal (prajavani.cgg.gov.in)."

# రబీ సీజన్‌లో వరి సాగు చేయొద్దు





ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి, స్వల్పకాలిక
పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**దామెర, 12 అక్టోబర్ 2026(జై భీమ్ న్యూస్)**

ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రాబోయే రోజుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రబీ సీజన్‌లో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయవద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, స్వల్పకాలిక పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని, బిందు సేద్యం ద్వారా పామ్ తోటలు, కూరగాయలు తదితర పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితర ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల రైతు వేదికల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులతో మాట్లాడారు. ఇందులో భాగంగా దామెర మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉండే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయడం ద్వారా నీటి వనరులను కాపాడుకోవడంతో పాటు రైతులు కూడా ప్రయోజనం పొందవచ్చన్నారు. నీటిని పొదుపుగా వినియోగించేందుకు బిందు సేద్యం వంటి ఆధునిక సాగు పద్ధతులను విస్తృతంగా వినియోగించాలని తెలిపారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్‌వెల్ రీచార్జ్ వంటి పనులను చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 315 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని, పరిస్థితులను పరిశీలించి ప్రభుత్వం త్వరలో కరువు మండలాలను ప్రకటించనుందని తెలిపారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై కూడా సరైన ప్రణాళిక రూపొందించి ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. భూగర్భ జల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించి గ్రౌండ్ లెవల్ నివేదికలను ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు. ప్రజా సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం చేపడుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సూచనలను రైతులు పాటించి రబీ సీజన్‌లో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎల్‌నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లాలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు తగ్గుతున్నాయని, అందువల్ల రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి వనరులను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్‌లో సాగు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రైతులు పంటల ఎంపికలో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల మార్పిడి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారా రబీ సీజన్‌లో నీటి కొరతను అధిగమించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కల్పన, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చంద్ర, డీఆర్డీవో మేన శ్రీను, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి, ఎంపీడీఓ కల్పన, మహిళా సంఘాల సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి వేడుకలు



**భీమదేవరపల్లి, 12 అక్టోబర్ 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శరన్నవరాత్రుల రెండో రోజు సందర్భంగా అమ్మవారిని అన్నపూర్ణ అలంకారంలో, బ్రహ్మచారిణి స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చేలా విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, శైవశుద్ధి, పుణ్యాహవచనం, సర్వతోభద్ర మండల ఆవాహన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి అనంతరం చతుఃషష్టి ఉపచార పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. సదా శ్రీ స్వామివారి సేవలో కార్యనిర్వహణ అధికారి పి. కిషన్ రావు తెలిపారు.

# ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





**హన్మకొండ, 12 అక్టోబర్ 2016(జై భీమ్ న్యూస్)**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించే ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు త్వరగా పరిష్కరించాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో 98 అర్జీలు, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాల్లో 30 అర్జీలు, జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల్లో 97 అర్జీలు ప్రజల నుంచి అందాయి. మొత్తంగా 225 అర్జీలు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, స్థానిక సంస్థల జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సంతోష లక్ష్మీ నరసింహ స్వామివారి కల్యాణ మహోత్సవం

వరంగల్‌లో ప్రత్యేక పూజలు, హోమంలో పాల్గొన్న మాజీ మంత్రి కొండా సురేఖ



**వరంగల్, 12 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

న్యూ శాయంపేటలోని శ్రీ దోనగుట్ట సంతోష లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమం, కల్యాణ మహోత్సవంలో మాజీ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ పూజలు, హోమం నిర్వహించగా, కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని కొండా సురేఖ స్వామివారిని ప్రార్థించారు. ఇటువంటి ఆధ్యాత్మిక వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ భక్తిభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# వైష్ణవి ప్రతిభా పురస్కారాలు అందించిన కాంగ్రెస్ నేత రాజనాల శ్రీహరి

### విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి వైష్ణవ సంఘానికి మంచి పేరు తీసుకురావాలి



**వరంగల్, 12 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి అన్నారు. శివనగర్‌లో ఆదివారం శ్రీ వైష్ణవి సంఘం వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు అధ్యక్షత వహించిన వెలుగులేటి సేనాచార్యుల సమక్షంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులు, శాలువాలు, షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా రాజనాల శ్రీహరితోపాటు రాష్ట్ర వైష్ణవ సంఘ ఉపాధ్యక్షుడు దరిపెల్లి సంపత్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీమాన్ దరఖాశయం, కాటూరి ఇందుమతి, కందాల కృష్ణమాచార్యులు, వెంకటరమణ, శ్రీ వైష్ణవి సంఘం సభ్యులు కాటూరి శ్రవణ్ కుమార్, హరిత తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల 60 డివిజన్ ఇన్‌చార్జ్‌లుగా ఏనుకొంటి నాగరాజు, బుస్సా నవీన్ కుమార్

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటన



**హన్మకొండ,12 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 60వ డివిజన్‌కు ఇన్‌చార్జ్‌లుగా మాజీ కార్పొరేటర్ ఏనుకొంటి నాగరాజు, 69వ డివిజన్ అధ్యక్షుడు బుస్సా నవీన్ కుమార్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నియమించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆయా డివిజన్లలో పార్టీ కార్యక్రమాల సమన్వయం, ఎన్నికల బాధ్యతల నిర్వహణ కోసం వీరిని ఇన్‌చార్జ్‌లుగా నియమించినట్లు సమాచారం.

## ప్రభుత్వ ఐటీఐలో ఉచిత శిక్షణ.. అక్టోబర్ 15 వరకు దరఖాస్తులు

**హన్మకొండ, అక్టోబర్ 12, 2026 (జై భీమ్ న్యూస్)**



ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐ.టి.ఐ / ఏ.టీ.సీ.. హన్మకొండ

పత్రిక ప్రకటన,

ఇసారాప్. సురేందర్
ప్రిన్సిపాల్
ఐటిఐ హన్మకొండ
సెల్ నం: 9247924154
లేఖ నెంబర్ బి/అడ్మిషన్ / ఫైల్ నెంబర్-67 /2026 తేది: 12-10-2026.

ప్రభుత్వం ఉపాధి కల్పన శిక్షణ శాఖ, ప్రభుత్వ ఐ.టి.ఐ., హనుమకొండ ITI/ATC నందు మిగిలి ఉన్న సీట్లకి కొత్త కోర్సులు లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 5th phase వాక్ ఇన్ అడ్మిషన్ల గడువు ఈనెల 10-10-2026 నుండి 15-10-2026 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ ఐటిఐ హనుమకొండ ప్రిన్సిపల్ ఇసారాప్. సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్ మెకానిక్ ,రిఫ్రిజిరేషన్ & ఎయిర్ కండిషనింగ్, వెల్డర్ సంవత్సరం పాటు ఆధునాతన కోర్స్ అయినా వర్చువల్ అనాలిసిస్ మరియు డిజైనర్-FEM (పరిమిత మూలక పద్ధతి), ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ , ఇండస్ట్రియల్ రోబోటిక్స్ మరియు డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ ట్రేడ్లు , మనుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేటిక్, ఎలక్ట్రిక్ మెకానిక్ వాహన మరియు కొత్త కోర్సులు 1) Drone Technician (6 నెలలు) 2) IOT (Internet on Things) (1 సంవత్సరం) ఐటిఐ కోర్సులలో ప్రవేశాలు ప్రారంభించబడ్డాయి.

•ప్రవేశాలకు అర్హతలు:•

1) 10వ తరగతి పాస్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
2) అభ్యర్థులు 01-08-2026 నాటికి కనీసం 14 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.
3) అన్ని అసలు సర్టిఫికెట్లను స్కాన్ చేసి ఆన్లైన్లో అప్లోడ్ చేయాలి.
4) అభ్యర్థులు ఒకే దరఖాస్తు ద్వారా రాష్ట్రంలోని ఏదైనా ఐటిఐ / ATCకు వెబ్ ఆప్షన్ల ద్వారా ఎంపిక చేయ్య అవకాశం ఉంది.
5) 1వ ,2వ 3వ, 4వ విడతలలో సీట్లు పొందని అభ్యర్థులు మరియు కొత్తగా దరఖాస్తు చేసుకోదలచిన వారు వెబ్‌సైట్: [https://iti.telangana.gov.in](https://iti.telangana.gov.in) నేరుగా 3వ విడత వాక్ ఇన్ కు ఉదయం 11.00 గ. నుండి 1.00 వరకు S.S.C Memo , Caste Certificate, Study /Bonafied certificate, TC, (Original certificates ) xerox set ,Two passphoto size photos తో రిపోర్ట్ చేసి సీట్ పొందగలరు.
6) ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, మెయిల్ ఐడీ తప్పనిసరిగా ఇవ్వాలి.
7) దరఖాస్తులో ఇచ్చిన సమాచారం మారితే సీటు రద్దయ్యే అవకాశం ఉంది.

ప్రిన్సిపాల్ Principal, Govt ఐటిఐ హన్మకొండ

ప్రధానమంత్రి నైపుణ్య శిక్షణ పథకం కింద ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి 5వ దశలో ఉచిత స్వల్పకాలిక శిక్షణ కోర్సులు నిర్వహించనున్నట్లు పుష్పల్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి. సుందర్ తెలిపారు. ఈ శిక్షణకు అక్టోబర్ 10 నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణలో ఎలక్ట్రిక్ మోటార్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్, వెల్డర్, కమ్యూనికేషన్ ప్రాథమిక అంశాలు, ఎలక్ట్రికల్ తదితర విభాగాల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రోన్ టెక్నీషియన్ కోర్సుకు 6 నెలలు, ఐఓటీ (ఇంటర్నెట్ అఫ్ థింగ్స్) కోర్సుకు ఒక సంవత్సరం వ్యవధితో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 2026 ఆగస్టు 1 నాటికి కనీసం 14 సంవత్సరాల వయస్సు పూర్తై ఉండాలని తెలిపారు. గరిష్ఠ వయోపరిమితి లేదని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు సమయంలో ఎస్ఎస్‌సీ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, స్టడీ/బోనఫైడ్ సర్టిఫికెట్, టీసీ, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు అక్టోబర్ 15వ తేదీలోపు దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. ఉచిత నైపుణ్య శిక్షణ ద్వారా యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యమని ప్రిన్సిపాల్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం పుష్పల్ ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీని సంప్రదించాలని సూచించారు.

## అర్ధరాత్రి హల్‌చల్.. 28 మందిపై కేసులు

### మిల్స్ కాలనీ పోలీసుల "ఆపరేషన్ చెబుత్రా".. 10 బైక్‌లు, 24 సెల్‌ఫోన్లు స్వాధీనం




**వరంగల్, అక్టోబర్ 12, 2026 (జై భీమ్ న్యూస్)**

అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై అనవసరంగా తిరుగుతూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్న వారిపై మిల్స్ కాలనీ పోలీసులు కొరడా ఝుళిపించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో "ఆపరేషన్ చెబుత్రా" పేరుతో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ కర్రె స్వామి ఆధ్వర్యంలో చింతల్, అబ్బనికుంట, లేబర్ కాలనీ, ఫోర్ట్ వరంగల్, శివనగర్, ఎస్ఆర్ఆర్ తోట, ఉర్సుగుట్ట, కరీమాబాద్, ఉర్సు, శంభునిపేట, రంగశాయిపేట తదితర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా సంచరిస్తూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న 28 మందిని అదుపులోకి తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన 15 మందిపై సీపీ యాక్ట్ సెక్షన్ 70(ఏ) కింద కేసులు నమోదు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ న్యూసెన్స్‌కు పాల్పడిన మరో 13 మందిపై సీపీ యాక్ట్ సెక్షన్లు 21, 70, 76 కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. తనిఖీల్లో 10 మోటార్ సైకిళ్లు, 24 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న 28 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా బయట తిరగడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, న్యూసెన్స్‌కు పాల్పడటం వల్ల ఎదురయ్యే పరిణామాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కర్రె స్వామి మాట్లాడుతూ ఆపరేషన్ చెబుత్రా నిరంతర ప్రక్రియ. ప్రతిరోజూ తనిఖీలు కొనసాగిస్తాం. రాత్రి వేళల్లో అవసరం లేకుండా బయట తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కర్రె స్వామితో పాటు సీఐలు మంగిలాల్, ఎస్. శ్రీనివాస్, ఐ. శ్రీనివాస్, శ్యాంసుందర్, పలువురు ఎస్సైలు, టాస్క్‌ఫోర్స్, త్వరిత స్పందన బృందం, ఇతర పోలీసు సిబ్బంది కలిపి మొత్తం 40 మంది పోలీసులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 153 అర్జీలు స్వీకరణ

### అర్జీలను సత్వరమే పరిష్కరించాలి
### కలెక్టర్ డాక్టర్ సత్య శారద





**వరంగల్, 12 అక్టోబర్ (జై భీమ్ న్యూస్)**

ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 153 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు 47, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 42, డీఆర్‌డీఏకు 13, ఇతర శాఖలకు 51 అర్జీలు అందాయి. అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎల్. కిషోర్ కుమార్, వై.వి. గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ వసంత, హౌసింగ్ పీడీ విష్ణువర్ధన్ రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజిరెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పీడిత ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన బీఆర్ భగవాన్ దాస్

**హన్మకొండ, అక్టోబర్ 12, 2026 (జై భీమ్ న్యూస్)**



పీడిత ప్రజల సంక్షేమం, వారి హక్కుల సాధన కోసం బీఆర్ భగవాన్ దాస్ నిరంతరం పోరాటం చేశారని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు, సాగించిన ఉద్యమాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. హనుమకొండలో బీఆర్ భగవాన్ దాస్ 23వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ భగవాన్ దాస్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భగవాన్ దాస్ ప్రజా సంక్షేమం కోసం చేసిన కృషిని, పీడిత వర్గాల హక్కుల కోసం సాగించిన పోరాటాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. బీఆర్ భగవాన్ దాస్ ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడారని తెలిపారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తితోనే తాము అనేక ప్రజా ఉద్యమాలను చేపట్టామని అన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు న్యాయం జరిగే వరకు ప్రజా ఉద్యమాలు కొనసాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భగవాన్ దాస్ చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నాయకులు అన్నారు. పీడిత, బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, భగవాన్ దాస్ అభిమానులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

## ఢిల్లీలో 'ఇండియా' కూటమి మహా ధర్నాలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్






**ఢిల్లీ, అక్టోబర్ 12, 2026 (జై భీమ్ న్యూస్)**

కేంద్ర ప్రభుత్వ తీరును, కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిని నిరసిస్తూ 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన మహా ధర్నాలో వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం పక్షపాత ధోరణికి వ్యతిరేకంగా నిర్వహించిన ఈ ఆందోళనలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ భవన్ నుంచి ప్రజాప్రతినిధులు భారీ ర్యాలీగా జంతర్ మంతర్ వద్ద ఏర్పాటు చేసిన ధర్నా వేదికకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని, ప్రతిపక్షాల అభ్యంతరాలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో అర్హులైన ఓటర్లను తొలగించడం, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడటం వంటి అంశాలపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని నాయకులు పేర్కొన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం, నిరసన కార్యక్రమాలకు ఆటంకాలు కల్పించడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై పారదర్శకమైన విచారణ, బాధ్యతాయుతమైన చర్యలు అవసరమని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని 'ఇండియా' కూటమి నేతలు స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని కాపాడటం, ఓటు హక్కును పరిరక్షించడం కోసం ఐక్యంగా పోరాడుతామని పేర్కొన్నారు. ఈ మహా ధర్నాలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

## పెండింగ్ దరఖాస్తులపై: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సమీక్ష

**కరీంనగర్, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్) :**

ప్రజావాణి కార్యక్రమానికి 138 దరఖాస్తులు వచ్చాయి. పెండింగ్ దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శాఖల వారీగా సమీక్షించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఐడిఓసి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తంగా 138 దరఖాస్తులు ప్రజల నుండి అందగా వాటి పరిష్కారానికి వివిధ శాఖల అధికారులకు బదిలీ చేశారు. కార్యక్రమానంతరం జిల్లా కలెక్టర్ వివిధ శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై సమీక్షించారు. ముఖ్యంగా పోలీస్, పంచాయతీ, ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్, ఎలక్ట్రిసిటీ, కార్పొరేషన్ శాఖల్లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాలోని వివిధ కార్యాలయాలకు వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

# న్యూఢిల్లీలో 12వ జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

**వరంగల్ జిల్లా నుంచి ఆరు వినూత్న ప్రాజెక్టుల ప్రదర్శన**

**వరంగల్, అక్టోబర్ 12, 2026(జై భీమ్ న్యూస్)**

పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, ఆవిష్కరణలు, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించే 12వ జాతీయ స్థాయి ప్రదర్శన మరియు ప్రాజెక్ట్ పోటీ (ఎన్.ఎల్.ఇ.పి.సి) సోమవారం న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో గల ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ (ఐటీపీఓ) హాల్ నంబర్-5లో ప్రారంభమైంది. అక్టోబర్ 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ జాతీయ స్థాయి ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పాఠశాల విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలు, శాస్త్రీయ నమూనాలు, ఆవిష్కరణలను ప్రదర్శిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మొత్తం 52 ప్రాజెక్టులు ప్రదర్శనకు ఎంపిక కాగా, వరంగల్ జిల్లా నుంచి ఆరు విద్యార్థుల ప్రాజెక్టులు జాతీయ స్థాయిలో ప్రదర్శించబడుతున్నాయి. జిల్లా సైన్స్ అధికారి పెట్లోజు సురేష్ బాబు సారథ్యంలో వరంగల్ జిల్లా విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొంటూ తమ ప్రతిభను చాటుతున్నారు. వరంగల్ జిల్లా నుంచి ఎంపికైన ప్రాజెక్టుల్లో జెడ్.పి.హెచ్.ఎస్. కేశవపూర్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి పాలబిందల శివ కుమార్ రూపొందించిన రైళ్లలోని పై బెర్త్‌ల కోసం మడతపెట్టగల నిచ్చెన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రైళ్లలో పై బెర్త్‌లకు ఎక్కేందుకు ఉపయోగించే సాధారణ నిచ్చెనలతో ఎదురయ్యే అసౌకర్యాలు, భద్రతా సమస్యలు, నిల్వకు ఎక్కువ స్థలం అవసరమయ్యే అంశాలను గమనించిన శివ కుమార్, ఫుట్‌రెస్ట్‌లతో కూడిన మడత నిచ్చెనను రూపొందించాడు. ఉపయోగించేటప్పుడు మెరుగైన ఆధారం, స్థిరత్వాన్ని అందించడంతో పాటు ఉపయోగంలో లేనప్పుడు సులభంగా మడిచి భద్రపరుచుకునేలా దీనిని రూపొందించాడు. ఈ ప్రాజెక్టుకు జయశ్రీ గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. ఆల్ఫోర్స్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని వన్నాల రిష్మిత సైక్లింగ్ ద్వారా చెత్త సేకరణ అనే వినూత్న ప్రాజెక్టును రూపొందించింది. ఇరుకైన వీధుల్లో సాధారణ చెత్త సేకరణ వాహనాలు వెళ్లలేకపోవడం, చెత్తను మూలం వద్దే వేరు చేయకపోవడం వల్ల ఏర్పడుతున్న సమస్యలకు పరిష్కారంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే సైకిల్‌ను రూపొందించింది. ఈ సైకిల్ ఇరుకైన సందుల్లో సులభంగా ప్రయాణించడంతో పాటు ఎలాంటి కార్బన్ ఉద్గారాలు లేకుండా పనిచేస్తుంది. తడి వ్యర్థాలను కంపోస్ట్‌గా, పొడి వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పంపే అవకాశం ఉండటంతో తక్కువ ఖర్చుతో సుస్థిర వ్యర్థాల నిర్వహణకు ఇది ఉపయోగపడుతుంది. ఈ ప్రాజెక్టుకు ఆర్. రంజిత్ గైడ్ టీచర్‌గా ఉన్నారు. ఎన్.ఎస్.ఆర్. ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని కె. నిత్య శ్రీ అపార్ట్‌మెంట్‌లలో మిగిలిపోయిన ఆహార పంపిణీ వ్యవస్థను రూపొందించింది. అపార్ట్‌మెంట్లు, రెస్టారెంట్లలో మిగిలిపోయే తినదగిన ఆహారాన్ని వృథా కాకుండా అవసరమైన వారికి చేరవేసేందుకు కమ్యూనిటీ ఆధారిత అప్లికేషన్‌ను రూపొందించారు. ఇందులో మిగిలిన ఆహారం వివరాలను నమోదు చేయడంతో పాటు, ఆహారం అందుబాటులో ఉన్న వెంటనే వాలంటీర్లు లేదా పంపిణీ సంస్థలకు సమాచారం అందే విధంగా వ్యవస్థను రూపొందించారు. దీని ద్వారా ఆహారాన్ని సకాలంలో సేకరించి నిరుపేదలు, ఆశ్రయ కేంద్రాలకు అందించవచ్చు. ఈ ఆవిష్కరణ ఆహార వృథాను తగ్గించడంతో పాటు సామాజిక సంక్షేమానికి దోహదపడుతుంది. ఈ ప్రాజెక్టుకు శ్రీనివాస్ కందుకూరి గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. జెడ్.పి.హెచ్.ఎస్. బుధరావుపేటకు చెందిన 6వ తరగతి విద్యార్థిని ఎస్.కె. రబియా పోర్టబుల్ హార్వెస్ట్ సీడ్ డ్రైయర్ను రూపొందించింది. కోత అనంతరం అనూహ్య వర్షాలు, అధిక తేమ కారణంగా ధాన్యం దెబ్బతినకుండా కాపాడేందుకు ఈ పరికరాన్ని అభివృద్ధి చేసింది. అల్యూమినియం సిలిండర్‌లో బ్లోవర్, వేడి చేసే మూలకాలతో కూడిన గదిని ఏర్పాటు చేసి, తడి విత్తనాలు లేదా ధాన్యంపై సమానంగా వేడి గాలి ప్రసరించేలా నమూనాను రూపొందించారు. విద్యుత్ లేదా బాహ్య బ్యాటరీ సహాయంతో పనిచేసే ఈ పరికరం ధాన్యం నాణ్యతను కాపాడటంతో పాటు పంట అనంతర నష్టాలను తగ్గించేందుకు ఉపయోగపడుతుంది. ఈ ప్రాజెక్టుకు గన్నరపు సారంగపాణి గైడ్ టీచర్‌గా ఉన్నారు. ఎంపీయూపీఎస్ రోళ్లకల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి ముప్పిడి సాయి రామ్ సెల్ఫ్-ఇంకింగ్ సీలింగ్ పెయింటింగ్ రోలర్ను రూపొందించాడు. సీలింగ్ పెయింటింగ్ సమయంలో కార్మికులు నిచ్చెనలు లేదా స్టూల్స్‌పై ఎక్కాల్సిన అవసరం లేకుండా నేలపైనే నిలబడి పెయింటింగ్ చేసేలా పొడిగించగల హ్యాండిల్‌ను ఏర్పాటు చేశారు. అదనపు పెయింట్ నేలపై పడకుండా సేకరించి తిరిగి ఉపయోగించుకునే విధంగా కంటైనర్‌ను, రోలర్‌కు నిరంతరం పెయింట్ అందించేలా సిరంజి ఆధారిత వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీనివల్ల కార్మికుల భద్రత మెరుగుపడటంతో పాటు పెయింట్ వృథా తగ్గుతుంది. ఈ ప్రాజెక్టుకు పి. సురేష్ బాబు మార్గదర్శక ఉపాధ్యాయుడిగా ఉన్నారు. ఠాగూర్ విద్యామందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని నర్రా అంజలి పెడల్‌తో పనిచేసే హ్యాక్సా యంత్రంను రూపొందించింది. చెక్క, ప్లాస్టిక్, లోహ పదార్థాలను కోయడానికి విద్యుత్ అవసరం లేకుండా మానవ శక్తితో పనిచేసేలా ఈ యంత్రాన్ని రూపొందించారు. పెడల్ తొక్కడం ద్వారా ఏర్పడే భ్రమణ చలనాన్ని హ్యాక్సా ముందుకు, వెనుకకు కదిలే చలనంగా మార్చే విధంగా దీనిని అభివృద్ధి చేశారు. సులభంగా వినియోగించగలిగే, తక్కువ ఖర్చుతో కూడిన పర్యావరణ అనుకూల పరిష్కారంగా రూపొందించిన ఈ యంత్రం వడ్రంగులు, చెక్కపని కార్మికులు, చిన్నతరహా ఫ్యాబ్రికేషన్ కార్యకలాపాలకు ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థి పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు పి. సందీప్ గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రయోగాత్మక నైపుణ్యాలు, ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించడమే ఈ జాతీయ స్థాయి ప్రదర్శన ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువ ఆవిష్కర్తలు తమ ఆలోచనలను పరస్పరం పంచుకోవడానికి, కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఈ వేదిక ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సామాజిక, పర్యావరణ, వ్యవసాయ, రోజువారీ జీవన సమస్యలను గుర్తించి వాటికి ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందించడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి జాతీయ స్థాయి ప్రదర్శనలో పాల్గొంటున్న ఆరుగురు విద్యార్థులు, వారి మార్గదర్శక ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు తమ ప్రాజెక్టులను సమర్థవంతంగా ప్రదర్శించి జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇలాంటి జాతీయ స్థాయి వేదికలు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడంతో పాటు, ఆచరణాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను రూపొందించేందుకు ప్రేరణనిస్తాయని అన్నారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ డా. కట్ల శ్రీనివాస్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మహేష్ నాయక్ కూడా విద్యార్థులను అభినందిస్తూ, జాతీయ స్థాయిలో వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# కిట్స్ వరంగల్‌లో ఘనంగా ముగిసిన ట్రై-సిటీ ఏఐ హ్యాకథాన్-2026

**15 విజేత జట్లకు గుర్తింపు.. రూ.50 వేల నగదు బహుమతులు అందజేత**

**వరంగల్, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) వరంగల్ క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్--ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన సెంటల్ ఇండియా సంస్థ సహకారంతో నిర్వహించిన ట్రై-సిటీ ఏఐ హ్యాకథాన్--2026 విజయవంతంగా ముగిసింది. అక్టోబర్ 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 24 గంటల పాటు విద్యార్థులు ఆవిష్కరణలు, సాంకేతిక సమస్యల పరిష్కారం, బృంద సమన్వయంతో తమ ప్రతిభను చాటుకున్నారు. కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ, కిట్స్ వరంగల్ ఆతిథ్యం ఇస్తున్న భారతదేశపు తొలి ట్రై-సిటీ ఏఐ హ్యాకథాన్‌గా ఈ కార్యక్రమానికి ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాలకు చెందిన సుమారు 150 కళాశాలలు, పాఠశాలల నుంచి 500 బృందాలకు చెందిన 1,500 మంది విద్యార్థులు హ్యాకథాన్‌లో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, వాస్తవ ప్రపంచ సమస్యలకు కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలను రూపొందించేలా ఈ కార్యక్రమం దోహదపడిందన్నారు. కిట్స్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కిట్స్ కోశాధికారి పి. నారాయణ రెడ్డి, హుస్నాబాద్ ఎమ్మెల్యే వి. సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తదితరులు హ్యాకథాన్‌ను విజయవంతంగా నిర్వహించిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్--ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగం అధ్యాపకులు, విద్యార్థి బృందాన్ని అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య




అతిథిగా హాజరైన సెంటల్ ఇండియా వ్యవస్థాపకుడు వంశీ గుగులోతు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా హ్యాకథాన్‌లో పాల్గొన్నారని తెలిపారు. మొత్తం 15 విజేత జట్లను ఎంపిక చేసి, వారికి ధ్రువపత్రాలతో పాటు రూ.50,000 నగదు బహుమతులను అందజేసి సత్కరించినట్లు తెలిపారు. విజేతలైన 15 జట్లలో ఎనిమిది జట్లు కిట్స్ వరంగల్‌కు చెందినవి కాగా, మిగిలిన ఏడు జట్లు వరంగల్, హైదరాబాద్, బెంగళూరులోని వివిధ కళాశాలలకు చెందినవని తెలిపారు. ఇది వరంగల్ త్రి-నగరాల ప్రాంతంలోని విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. హ్యాకథాన్‌లో విద్యార్థులు కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం తదితర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ పలు వినూత్న ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో అభివృద్ధి చేశారు. వివిధ రంగాలకు చెందిన మెంటార్లు, పరిశ్రమ ప్రతినిధులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ వారి ఆలోచనలను మరింత మెరుగుపరిచేందుకు సహకరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యం, బృందంగా పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందించడంలో హ్యాకథాన్ కీలకంగా నిలిచింది. సెంటల్ ఇండియా సంస్థ ఐఐటీ, ఐఐఎం పూర్వ విద్యార్థులచే స్థాపించబడిన సంస్థగా హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో ఇంక్యుబేట్ అవుతోందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు, యువ నిపుణులకు వృత్తి అభివృద్ధి, ఆవిష్కరణలు, పరిశ్రమలతో అనుసంధానం కల్పించడంపై సంస్థ ప్రధానంగా దృష్టి సారిస్తోందన్నారు. విద్యార్థుల సాంకేతిక ఆవిష్కరణలను వాస్తవ ప్రపంచ అనుభవాలు, పరిశ్రమ అవసరాలు, భవిష్యత్ వృత్తి అవకాశాలతో అనుసంధానం చేయడం హ్యాకథాన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా కిట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ విజేత జట్లతో పాటు హ్యాకథాన్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థిని అభినందించారు. ఇలాంటి సాంకేతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని, నూతన ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంటల్ ఇండియా సహ వ్యవస్థాపకుడు జి. సాయి కృష్ణ, సీఎస్ఎం విభాగాధిపతి డాక్టర్ ఎ. జ్యోతి ప్రభ, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ డి. ప్రభాకర చారి, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ బి. హనుమంతు, వివిధ రంగాలకు చెందిన మెంటార్లు, పరిశ్రమ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు సాగిన ఈ హ్యాకథాన్‌లో సుమారు 1,500 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



# అన్నపూర్ణేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన భద్రకాళి అమ్మవారు



**వరంగల్, అక్టోబర్ 12, 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయుల రాజధాని ఏకశిలా నగరంగా చారిత్రక ప్రాశస్త్యం పొందిన వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 4 గంటలకు నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేపట్టారు. సోమవారం ఉదయం అమ్మవారిని బ్రహ్మచారిణి దుర్గా క్రమంలో, సాయంకాలం దేవజా దుర్గా క్రమంలో పూజారాధనలు నిర్వహించారు. అనంతరం ఉదయం మకర వాహన సేవ, సాయంకాలం చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. మకర వాహనంపై అమ్మవారిని గంగాభవానిగా, చంద్రప్రభ వాహనంపై రాజరాజేశ్వరిగా అలంకరించి ఊరేగించారు. ఈ సేవలను దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నవదుర్గా క్రమంలోని బ్రహ్మచారిణి దుర్గా ఆరాధన ద్వారా సాధకుడు తన దృష్టిని శరీరంలోని స్వాధిష్టాన చక్రంపై కేంద్రీకరించుకుని విష్ణుమూర్తి అనుగ్రహానికి పాత్రుడై అధికారం, జ్ఞానం పొందుతారని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. దేవజా దుర్గా సమస్త దేవతా కోవకు మూలభూతంగా ఉండి, సాధకుడిని బాధించే అసురీ శక్తులను దూరం చేస్తుందని వివరించారు. మకర వాహనంపై గంగాభవానిగా అమ్మవారిని దర్శించడం వల్ల జలగండాలు దూరమవుతాయని, చంద్రప్రభ వాహనంపై రాజరాజేశ్వరిగా దర్శించుకోవడం ద్వారా చంచలత్వం తొలగి మనస్సు స్థిరమై సాధనలో నిమగ్నమయ్యే శక్తి కలుగుతుందని తెలిపారు. మూడో రోజు మంత్రదీక్షకు సంకేతంగా అమ్మవారిని గాయత్రిగా అలంకరించే నేపథ్యంలో, దానికి ముందు రోజు సాధకుడికి తల్లితో సహా భోజనం పెట్టే సంప్రదాయానికి సంకేతంగా రెండో రోజు అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా అలంకరిస్తారని పేర్కొన్నారు. అన్నపూర్ణేశ్వరి అలంకారంలో అమ్మవారిని దర్శించడం వల్ల ఆకలి బాధలు దరిచేరవని, భక్తులకు మృష్టాన్న ప్రాప్తితో పాటు దీర్ఘకాలం సాధన చేసేందుకు అవసరమైన బుద్ధి, శక్తి కలుగుతాయని ఆలయ వర్గాలు తెలిపారు. అనంతరం దేవాలయ మహామండపంలో మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు నిర్వహించారు. సోమవారం రోజున కార్యక్రమాలకు ఉభయదాతలుగా సూర్యకుటీర్ అధినేతలు తంగళ్లపల్లి తిరుమలాదేవి సంపత్ కుమార్, హర్షవర్ధన్--డా. మానస దంపతులు, కుమారి వైష్ణవి, బైరి రవికృష్ణగౌడ్--సరోజన దంపతులు, హరికృష్ణ--హరిత దంపతులు, ఊడుగుల సాయికిరణ్--డా. హర్షిత దంపతులు, గీతాభవన్, రాఘవేంద్ర టిఫిన్స్ హోటల్స్ అధినేతలు బాలచంద్రహోళ్ళ--రేణుక దంపతులు, చంద్రశేఖర శెట్టి--జ్యోతి దంపతులు, కొప్పు నాగరాజశెట్టి--ప్రభావతి దంపతులు, అన్నపశెట్టి--హేమ దంపతులు, సందీప్ దీవెశెట్టి -- సమత దంపతులు వ్యవహరించారు. సాయంకాలం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు.

# విధి నిర్వహణతో పాటు మానవత్వం.. ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రవణ్‌కు ప్రశంసలు



**వరంగల్, అక్టోబర్ 12, 2026 (జై భీమ్ న్యూస్)**

విధి నిర్వహణలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు ఆపదలో ఉన్న వాహనదారుడికి మానవత్వంతో సహాయం చేసి ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రవణ్ ప్రశంసలు అందుకున్నారు. వరంగల్ నుంచి హనుమకొండ వైపు సుమారు 70 ఏళ్ల నాగేశ్వరరావు మారుతి 800 కారులో ప్రయాణిస్తుండగా, హనుమకొండ బస్టాండ్ సర్కిల్ వద్ద అకస్మాత్తుగా కారులో సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో కారు రోడ్డుపైనే నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడే పరిస్థితి నెలకొంది. అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రవణ్ వెంటనే స్పందించారు. వృద్ధుడైన నాగేశ్వరరావుకు ఇబ్బంది కలగకుండా, అలాగే వాహనం కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ఉండేందుకు స్వయంగా కారును నెట్టుకుంటూ రోడ్డు పక్కకు తీసుకెళ్లారు. అనంతరం వాహనాన్ని సురక్షితంగా నిలిపి ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు. కానిస్టేబుల్ శ్రవణ్ చూపిన సేవాభావం, మానవత్వాన్ని అక్కడి ప్రజలు, వాహనదారులు అభినందించారు. కారు యజమాని నాగేశ్వరరావు సైతం ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. విధి నిర్వహణతో పాటు ఆపదలో ఉన్న వాహనదారుడికి అండగా నిలిచిన ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రవణ్‌పై పలువురు ప్రశంసలు కురిపించారు.

# చింతగట్టులో రవాణా శాఖ శాశ్వత కార్యాలయానికి స్థల పరిశీలన





**హసన్‌పర్తి, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సోమవారం చింతగట్టు క్యాంపులో స్థల పరిశీలన చేపట్టారు. రవాణా, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులతో కలిసి చింతగట్టు క్యాంపులోని ఎస్సారెస్పీ భూములను పరిశీలించిన కలెక్టర్, కార్యాలయ భవనంతో పాటు ఆధునిక రవాణా సదుపాయాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. ముందుగా చింతగట్టు క్యాంపులో ప్రస్తుతం కొనసాగుతున్న రవాణా శాఖ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ఎస్సారెస్పీ భూములను పరిశీలించి, జిల్లా రవాణా శాఖకు శాశ్వత కార్యాలయ భవనం నిర్మించేందుకు అనుకూలమైన స్థలంపై అధికారులతో చర్చించారు. జిల్లా రవాణా శాఖ కార్యాలయంతో పాటు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్, ఆధునిక డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించి కేటాయించే అంశంపై కూడా కలెక్టర్ సమీక్షించారు. రవాణా శాఖ కార్యాలయ సముదాయం ఏర్పాటుకు సుమారు ఏడు ఎకరాల భూమి అవసరమని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. చింతగట్టు క్యాంపులోని ప్రత్యామ్నాయ స్థలాన్ని మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుబాటులో ఉన్న భూమి విస్తీర్ణం, స్థల అనుకూలత, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన**

అనంతరం హసన్‌పర్తిలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం అవసరమైన స్థలాన్ని కూడా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. హసన్‌పర్తి పోలీస్ క్వార్టర్స్ వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించి, అక్కడ 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలు, ప్రతిపాదనలపై విద్యుత్ శాఖ అధికారులతో చర్చించారు. పోలీస్ క్వార్టర్స్ ప్రాంతం ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న నేపథ్యంలో సంబంధిత స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి, అందుబాటులో ఉన్న భూమి విస్తీర్ణం, స్థల పరిస్థితి తదితర వివరాలతో నివేదిక సమర్పించాలని హసన్‌పర్తి తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా చింతగట్టు క్యాంపు సమీపంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అవసరమైన అదనపు భూమిని గుర్తించి, దానికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేష్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి జనార్దన్ రెడ్డి, నీటిపారుదల శాఖ డీఈ రవి, విద్యుత్ శాఖ డీఈ మల్లికార్జున్, ఏడీఈ అశోక్, ఏఈ శిరీష్, హసన్‌పర్తి తహసీల్దార్ కిరణ్ కుమార్, మండల సర్వేయర్ సుజాత, ఏఆర్ఐ ప్రసాద్, జీపీఓ ప్రవీణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## హసన్‌పర్తి మండల కార్యాలయంలో గ్రీవెన్స్.. రెవెన్యూ శాఖకు ఒకే వినతి





**హసన్‌పర్తి, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండల కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించి ఒక వినతి పత్రం మాత్రమే అందినట్లు అధికారులు తెలిపారు. మిగతా శాఖలకు సంబంధించి ఎలాంటి వినతులు అందలేదని హసన్‌పర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) సుమనా వాణి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువచ్చి, సమస్యకు సంబంధించిన అవసరమైన ఆధారాలు, పత్రాలతో గ్రీవెన్స్ కార్యక్రమంలో వినతులు సమర్పించాలని ఆమె సూచించారు. గ్రీవెన్స్ కార్యక్రమానికి రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, మహిళా సంక్షేమం, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్, మిషన్ భగీరథ, ఆర్అండ్‌బీ, పశువైద్య తదితర శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో అందిన వినతులను నిబంధనల ప్రకారం పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సంబంధిత పత్రాలు, ఆధారాలతో అధికారులను సంప్రదించాలని సూచించారు.

## గ్యార్మీ షరీఫ్ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి కొండా సురేఖ

**మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు..**
**ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థన**





**వరంగల్, 12 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలోని మండి బజార్ జెండాల ప్రాంతంలో నిర్వహించిన గ్యార్మీ షరీఫ్ వేడుకలో మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని అల్లాహ్‌ను ప్రార్థించినట్లు తెలిపారు. అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, సోదరభావంతో కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు.గ్యార్మీ షరీఫ్ వేడుకలో భాగంగా నిర్వహించిన ప్రార్థనల్లో ముస్లిం మత పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## సారభవరం శివార్లలో ఎక్సైజ్ దాడి

**- 20 లీటర్ల సారా స్వాధీనం**

**దేవీ పట్నం, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్) :**

సారభవరం శివార్లలో ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే 100 లీటర్ల బెల్లం ఊట, సారా తయారీ సామాగ్రిని ధ్వంసం చేశారు.నిందితుడిపై కేసు నమోదు చేసి రంపచోడవరం గౌరవ కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు తెలిపారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలి!

**ఓటర్ల జాబితాలో అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి**
**రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం**
**ఢిల్లీ నిరసనలో టీపీసీసీ నేత డా. పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్**
**ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతకు పట్టం కట్టాలి**
**ఓటు హక్కును పరిరక్షించడం ఎన్నికల సంఘం బాధ్యత**

**ఢిల్లీ, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్):**

ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ సంస్థల స్వతంత్రతను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, టీపీసీసీ నేత డా. పెరుమాండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణల పేరుతో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన మార్చ్, నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌ఛార్జి సచిన్ సావంత్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు నిరసనలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు నినాదాలు చేస్తూ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డా. పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన కీలకమైన హక్కు అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయానికి ఓటు ద్వారా ప్రతిబింబం లభిస్తుందని, ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణలపై ప్రజల్లో వ్యక్తమవుతున్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగేలా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య, రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆయన విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటం, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని పునరుద్ఘాటించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల నిలుపుదల, పౌరుల ఓటు హక్కు రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తుందని డా. పెరుమాండ్ల రామకృష్ణ తెలిపారు.




## వాట్సాప్‌లో NO అని రిప్లై ఇస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ అవుతుందా?

**సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**
**ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్ పేరుతో హెచ్చరిక**
**గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే సందేశాలతో జాగ్రత్త**
**బ్యాంకు లావాదేవీలను అధికారిక యాప్‌లోనే పరిశీలించాలి**
**మోసానికి గురైతే 1930కు ఫోన్ చేయాలి**

**హైదరాబాద్, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్) :**

వాట్సాప్‌లో NO అని సమాధానం ఇచ్చినందుకే బ్యాంకు ఖాతాలోని డబ్బులు ఖాళీ అయ్యాయంటూ వస్తున్న సైబర్ మోసాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సూచించారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి బ్యాంకు లావాదేవీల పేరుతో వచ్చే సందేశాలను నమ్మవద్దని, వాటికి YES, NO అని సమాధానం ఇవ్వవద్దని హెచ్చరించారు. ఖాతా నుంచి డబ్బులు డెబిట్ అయినట్లు సందేశం వచ్చినప్పుడు ఆందోళన చెందకుండా, బ్యాంకు అధికారిక యాప్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా లావాదేవీలను పరిశీలించాలని సూచించారు. అనుమానాస్పద సందేశాలు పంపిన నంబర్లను బ్లాక్ చేసి, వాట్సాప్ ద్వారా వచ్చే సూచనల ఆధారంగా ఎలాంటి చర్యలూ తీసుకోవద్దన్నారు. అయితే, కేవలం NO అని రిప్లై ఇచ్చినంత మాత్రాన మాల్‌వేర్ పనిచేసి ఫోన్‌పై నియంత్రణ సాధిస్తుందనే వాదనకు సాంకేతిక ఆధారాలు అవసరం. సందేశానికి సమాధానం ఇవ్వడం ఒక్కటే సాధారణంగా బ్యాంకు ఖాతాను ఖాళీ చేయడానికి సరిపోదు. అయినప్పటికీ గుర్తుతెలియని సందేశాల్లోని లింకులు, ఫైళ్లు తెరవడం, అనుమానాస్పద యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం, వ్యక్తిగత వివరాలు పంచుకోవడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. ఒకవేళ సైబర్ మోసానికి గురై డబ్బులు కోల్పోతే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేయాలని, లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సజ్జనార్ సూచించారు. త్వరగా ఫిర్యాదు చేయడం ద్వారా డబ్బుల బదిలీని అడ్డుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

## ఉక్రెయిన్ యుద్ధంలో తెలంగాణ వాసి మృతి.. కుటుంబానికి అండగా రేవంత్ సర్కారు

**రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో జగిత్యాల వాసి సుదర్శన్ గౌడ్ మృతి**
**మృతుడి కుటుంబానికి రూ. 6 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన సీఎం రేవంత్**
**ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లిన బాధితుడు**
**మృతదేహాన్ని స్వదేశానికి తెచ్చేందుకు అధికారులకు ఆదేశాలు**

**హైదరాబాద్, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్) :**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తెలంగాణ వాసి కుటుంబానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. జగిత్యాల జిల్లా, హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ మృతిచెందగా, అతడి కుటుంబానికి రూ. 6 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, సుదర్శన్ గౌడ్ ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడ జరుగుతున్న యుద్ధంలో భాగంగా క్షిపణులు, డ్రోన్ దాడుల కారణంగా అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సుదర్శన్ గౌడ్ భార్య విజ్ఞప్తి మేరకు, ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే మానవతా దృక్పథంతో స్పందించిన సీఎం, ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, సీఎం సహాయ నిధి (CMRF) నుంచి ఈ మొత్తాన్ని విడుదల చేసేందుకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, సుదర్శన్ గౌడ్ భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# ఎల్ నినో ముప్పు నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం






**రబీ సీజన్‌లో వరి సాగుకు దూరంగా ఉండాలి**
**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**
**నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలి..**
**రైతులకు కలెక్టర్ సత్య శారద సూచన**

**వరంగల్, 12 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. రబీ సీజన్‌లో అధిక నీటి వినియోగం అవసరమయ్యే వరి సాగుకు దూరంగా ఉంటూ, తక్కువ నీటితో పండే స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సంరక్షించుకుంటూ, ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.సోమవారం హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న వ్యవసాయ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి వనరుల పరిరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు.

**తక్కువ నీటితో పండే పంటలపై దృష్టి**

ఎల్ నినో పరిస్థితుల వల్ల వాతావరణంలో మార్పులు సంభవించి నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బిందు సేద్యం వంటి నీటి పొదుపు పద్ధతులను అనుసరిస్తూ పామ్ ఆయిల్ తోటలు, కూరగాయల సాగు వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించవచ్చని తెలిపారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, ఊర కుంటల అభివృద్ధి, బోరుబావుల రీచార్జ్ వంటి పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 315 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్న ఉప ముఖ్యమంత్రి, పరిస్థితులను సమీక్షించి కరువు మండలాల ప్రకటనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. వచ్చే వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటి వినియోగంపై ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని, భూగర్భ జలాల పరిస్థితిపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని ఆదేశించారు.

**నీటి లభ్యతను బట్టి పంటల సాగు: కలెక్టర్ సత్య శారద**

గీసుకొండ మండలం కోనాయిమాకుల గ్రామంలోని రైతు వేదిక నుంచి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో వాతావరణ మార్పులు వ్యవసాయ రంగంపై, ప్రజల జీవన విధానంపై చూపే ప్రభావాలను వివరించారు. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకొని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. భూగర్భ జలమట్టాలు తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున అధిక నీరు అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా పెసలు, మినుములు, అలసందలు, నువ్వులు వంటి స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడంపై దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ఈ పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, అనుసరించాల్సిన పద్ధతులపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

**వేసవి తాగునీటి అవసరాలపై ముందస్తు ప్రణాళిక**

వచ్చే వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు వర్షపు నీటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నీటి వృథాను అరికట్టడంలో ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగ భారాన్ని తగ్గించేందుకు ఇళ్ల వద్ద, వ్యవసాయ క్షేత్రాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించాలని తెలిపారు. ఎల్ నినో పరిస్థితుల వల్ల తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్, విద్యుత్, భూగర్భ జల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆనందం, ఇరిగేషన్ ఎస్ఈ రామ్ ప్రసాద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, ఇతర శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం అందించాలి

**రైతులకు 24 గంటల విద్యుత్ అందించి, కాళేశ్వరం నీటిని వెంటనే విడుదల చేయాలి**
**దళిత బంధు రెండో విడతను వెంటనే అమలు చేయాలి**
**కమలాపూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి**
**కమలాపూర్ బస్‌స్టాండ్ నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలి**

**కమలాపూర్, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్) :**

మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా కొనసాగించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే గొప్ప ఉద్దేశంతో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పథకాల ద్వారా వేలాది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రూ.1,00,116 ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం అందిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. చెక్కులతో పాటు తులం బంగారాన్ని కూడా వెంటనే అందించి పేద కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం రైతులకు కేవలం 7 గంటలే విద్యుత్ అందిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో పాటు కాళేశ్వరం ద్వారా సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. దళిత కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది స్వయం ఉపాధితో గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో కేసీఆర్ గారు దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రెండో విడత దళిత బంధును నిలిపివేయడంతో అర్హులైన దళిత కుటుంబాలు ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. దళితుల అభ్యున్నతిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రెండో విడత దళిత బంధును అమలు చేసి అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. గర్భిణులు, నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాలు తల్లీబిడ్డలకు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఆడపిల్ల పుడితే రూ.12,000, మగపిల్లాడు పుడితే రూ.13,000 ఆర్థిక సహాయం అందించే పథకాల ప్రయోజనాలు ప్రజలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నిలిపివేసిన పథకాలను వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేసినప్పటికీ, కనీస మౌలిక సదుపాయాలు లేకుండా పంపిణి చేసారు అని ఎమ్మెల్యే తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేసీఆర్ హయాంలో కమలాపూర్ బస్‌స్టాండ్ నిర్మాణ పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తికాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం తక్షణమే అవసరమైన నిధులు మంజూరు చేసి బస్‌స్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను కొనసాగించడం ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులు, పేద కుటుంబాలు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం అందించాలని, దళిత బంధు రెండో విడత అమలు చేయాలని, రైతులకు నాణ్యమైన విద్యుత్, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కమలాపూర్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం, అంతర్జాతీయ బాలికా దినోత్సవంపై న్యాయ చైతన్య సదస్సు

**- విద్యార్థులకు అవగాహన**

**కొత్తగూడెం, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్) :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి యం. రాజేందర్ గారి ఆదేశాల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చల్లగాలి సాహితి చుంచుపల్లి హైస్కూల్‌లో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం, అంతర్జాతీయ బాలికా దినోత్సవాల ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడిని అధిగమించడం, ఆత్మవిశ్వాసంతో ఉండటం, సమస్యలను పెద్దలతో పంచుకోవడం వంటి అంశాలను వివరించారు. బాలికల విద్య, సమాన హక్కులు, భద్రత, సాధికారతపై అవగాహన కల్పించారు. అలాగే పోక్సో చట్టం?2012, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై వివరించి, బాలల హక్కులను పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# 101 రేవంత్ పాలమూరు బిడ్డ కాదు..పాలమూరు ద్రోహి

**హైదరాబాద్, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్) :**

రైతులు ఇబ్బందులు పడుతుంటే రేవంత్ రెడ్డి, మంత్రులు గోవా, ఢిల్లీ అని ట్రిప్పులు వేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ఎల్ నినో పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతారని, రైతు వేదికల వద్దకు రావాలని ఎమ్మెల్యేలకు, రైతులకు అధికారులు సర్క్యులర్ ఇచ్చారు. ఉదయం 9:52 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ క్యాన్సిల్ అని మెసేజ్ పెట్టారు. మళ్లీ 11:15 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ఉంది రండి అని చెప్పి, మళ్లీ కాసేపటికి 1:00 గంటలకు సీఎం రాడు, డిప్యూటీ సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి వస్తారని చెప్పారు. అంటే రాష్ట్ర రైతులు ఇబ్బందులు పడుతుంటే వీళ్లు చిన్న పిల్లల ఆటలు ఆడుతున్నారని ఆరోపించారు. ఆటు ఏపీలో లేని కరువు తెలంగాణలో ఎందుకు ఉందని అయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకనే ఈరోజు తెలంగాణలో కరువు పరిస్థితులు ఉన్నాయి. తెలంగాణ నుంచి కృష్ణా, గోదావరి నదులు పారుతుంటే రేవంత్ రెడ్డి నీటిని వదిలిపెడుతున్నాడు, చంద్రబాబు ఒడిసిపడుతున్నాడని అన్నారు. గురు దక్షిణ చెల్లిస్తున్నావా రేవంత్ రెడ్డి? 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న తన కుప్పం నియోజకవర్గానికి నీళ్లు తీసుకెళు న్నానని చంద్రబాబు నాయుడు చెప్తున్నాడు. పట్టిసీమ ద్వారా 500 టీఎంసీల నీళ్లు లిఫ్ట్ చేశానని చంద్రబాబు ట్వీట్ వేశాడు. రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డ కాదు, పాలమూరు ద్రోహి అని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వానికి లిక్కర్ మీద ధ్యాస ఉంది కానీ రైతుల మీద లేదు. సింగూరులో ఉన్న రెండు టీఎంసీల నీళ్లను తాగునీటి కోసం వాడకుండా, లిక్కర్ ఫ్యాక్టరీలకు సప్లై చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో తాగునీటి కష్టాలు వస్తే ఎలా అని నిలదీసారు. హైదరాబాద్ నగరంలో కంపెనీలకు, ప్రజలకు 50% నీళ్లు మాత్రమే సప్లై చేస్తామని నోటీసులు ఇస్తున్నారు. కానీ బీర్లు తయారు చేయడానికి ఎలాంటి కొరత లేదు, పుష్కలంగా సప్లై చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్తున్నాడని అన్నారు.

# మంగంపల్లిలో కోటి రూపాయలతో ఆధునిక ఆలయ నిర్మాణానికి ప్రత్యేక పూజలు

## భక్తిశ్రద్ధలతో హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యేదంపతులు

**వనపర్తి, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్) :**

వనపర్తి నియోజకవర్గంలోని పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో భక్తుల ఆధ్యాత్మిక ఆకాంక్షలకు అనుగుణంగా పాత ఆంజనేయస్వామి, శివాలయాల స్థానంలో రూ.కోటి వ్యయంతో ఆధునిక ఆలయాన్ని నిర్మించేందుకు ఎశ్రీజీ మేఘారెడ్డి, శారదరెడ్డి దంపతులు సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.గ్రామాల్లో ఆధ్యాత్మిక సంప్రదాయాలను పరిరక్షిస్తూ, భక్తులకు మెరుగైన ఆలయ సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న ఈ నిర్మాణ కార్యక్రమం మంగంపల్లి గ్రామ ప్రజలకు, భక్తులకు ప్రాధాన్యత సంతరించుకుంది.నూతన ఆలయ నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత విస్తరించనుంది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను వారి కర్మానికి వదిలేసి ఢిల్లీకి యాత్రలా ?

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.**

**వనపర్తి, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్) :**

ఎల్‌నినో మీద కీలక క్యాబినెట్ సమావేశం, రైతువేదికల్లో రైతులతో వీడియో కాన్ఫరెన్స్ అని ప్రకటించి దానిని వాయిదా వేసి కాంగ్రెస్ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా ఢిల్లీకి వెళ్లడం వారి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం.అబద్దాలతో అధికారంలోకి వచ్చి, అబద్దాలతో పాలన కొనసాగిస్తున్నారు.మొన్నటిదాకా ఆరుతడి పంటలు వేసుకొమ్మని ప్రచారం చేసి ఇప్పుడు అసలు రెండో పంట వేయనే వద్దంటూ సీఎం, మంత్రులు రైతులను హెచ్చరించడం దుర్మార్గం.సాగునీళ్లు మాత్రమే కాదు కనీసం తాగునీళ్లు కూడా దొరకవు, కరంటు కూడా ఇవ్వలేం అని ప్రకటించడం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, వ్యవసాయాన్ని, ప్రజల విషయంలో చేతులు ఎత్తేసిందని స్పష్టమవుతుందిసాగునీళ్లు ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా ఎత్తిపోతల మోటార్లను బందుపెట్టి ఈ ప్రభుత్వం రైతాంగం, వ్యవసాయం నడ్డి విరిచింది.రాష్ట్రంలో కరంటు రాక పంటలు ఎండి, లో ఓల్టేజీతో మోటార్లు కాలిపోయి రైతులు ఆవేదనతో రోడ్లెక్కుతుంటే, కాంగ్రెస్ నేతలు విమానాలు ఎక్కి ఢిల్లీకి పోతున్నారుజాతీయ పార్టీలను నమ్ముకుంటే అధోగతి అని కేసీఆర్ అనేకమార్లు చెప్పారు. వారికి తెలంగాణ ప్రయోజనాలు, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలు, వారి పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని, ఒక్క బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ముందు తెలంగాణ ప్రయోజనాలు, తర్వాతే ఇతర ప్రయోజనాలు అని స్పష్టంగా చెప్పారు.కేసీఆర్ పాలనలో పండగలా ఉన్న వ్యవసాయం, రాజులా బతికిన రైతు కాంగ్రెస్ పాలనలో తిరిగి వెనకటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# కోహెడ మండల బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికిహాజరైన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

**కోహెడ, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్) :**

కోహెడ మండల కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశానికి హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం వంటి అంశాలపై చర్చించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు మనోధైర్యం నింపుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ప్రజలతో మమేకమై పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కోహెడ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ పోలీస్ అకాడమీలో కలకలం..

**40 మందికి పైగా ట్రైనీ డీఎస్పీలు ఫెయిల్!**

**శిక్షణా ప్రమాణాలపై ప్రశ్నలు..**

**అసలు లోపం ఎక్కడ? పోలీసు వ్యవస్థలో సమీక్ష అవసరమా?**





**హైదరాబాద్ (జై భీమ్ స్పెషల్ న్యూస్)**

తెలంగాణ పోలీస్ అకాడమీలో డీఎస్పీల శిక్షణ, పరీక్షల ఫలితాలు చర్చనీయాంశంగా మారాయి. గ్రూప్--1 ద్వారా ఎంపికైన 112 మంది ట్రైనీ డీఎస్పీల్లో 40 మందికి పైగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని వార్తా కథనాలు వెల్లడించడంతో పోలీసు వర్గాల్లో చర్చ మొదలైంది. సుమారు 35 శాతం మంది విఫలమైనట్లు వచ్చిన సమాచారం శిక్షణా విధానం, బోధనా ప్రమాణాలు, అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, చట్టాల అమలు వంటి కీలక బాధ్యతలు చేపట్టాల్సిన అధికారులకు శిక్షణ అందించే వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేస్తోందనే అంశంపై సమీక్ష అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రూప్--1 నియామకాల ద్వారా ఎంపికైన ఈ శిక్షణార్థులకు 2025 నవంబర్‌లో శిక్షణ ప్రారంభమైనట్లు నివేదికలు పేర్కొన్నాయి. శిక్షణలో చట్టాలు, నేర పరిశోధన, ఫోరెన్సిక్ సైన్స్, సైబర్ నేరాలు, ఆయుధాల వినియోగం, క్షేత్రస్థాయి విధులు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. అయితే, ఇంతమంది పరీక్షల్లో విఫలమవడానికి అసలు కారణాలేమిటనే ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా మారింది. శిక్షణార్థుల వ్యక్తిగత సన్నద్ధతలో లోపాలున్నాయా? బోధనా విధానంలో మార్పులు అవసరమా? పరీక్షల మూల్యాంకన ప్రమాణాలు ఎలా ఉన్నాయి? అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అకాడమీలో శిక్షణా ప్రణాళిక,అధ్యాపకుల సేవల వినియోగం, కీలక పరిపాలనా బాధ్యతల నిర్వహణ వంటి అంశాలపై కూడా వార్తా నివేదికల్లో ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. అయితే, ఈ అంశాలన్నింటిపై అధికారికంగా తుది నిర్ధారణ వెలువడినట్లు స్పష్టత లేదు. పరీక్షల్లో విఫలమైన ప్రతి శిక్షణార్థిని ఒకే విధంగా అంచనా వేయడం సరికాదు. అదే సమయంలో ఇంత పెద్ద సంఖ్యలో అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించకపోవడానికి గల కారణాలను గుర్తించకుండా వదిలేయడం కూడా సమంజసం కాదు. పరీక్షల్లో విఫలమైన వారికి మరోసారి పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తామని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్ తెలిపినట్లు వార్తా కథనం పేర్కొంది. వారికి అదనపు బోధన, ప్రత్యేక మార్గదర్శకత్వం అందించడంతో పాటు శిక్షణా కార్యక్రమాల నాణ్యతను కూడా సమీక్షించడం అవసరం. ఎందుకంటే ఒక డీఎస్పీ బాధ్యత కేవలం పోలీస్ స్టేషన్‌ను పర్యవేక్షించడం మాత్రమే కాదు; బాధితులకు న్యాయం అందేలా చూడటం, నేరాలను అరికట్టడం, చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయడం, ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని పెంచడం కూడా ఆయన విధుల్లో భాగం. అందుకే పోలీసు శిక్షణలో నాణ్యత, క్రమశిక్షణ, చట్టాలపై పట్టు, ప్రజల పట్ల బాధ్యతాయుతమైన వైఖరికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణా ప్రమాణాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, అవసరమైన మార్పులు చేపట్టాలని ప్రజాస్వామ్య వర్గాలు కోరే అవకాశం ఉంది. ఇంతమంది శిక్షణార్థులు పరీక్షల్లో ఎందుకు విఫలమయ్యారు? బోధనా విధానంలో ఏమైనా మార్పులు అవసరమా? శిక్షణార్థులకు తగిన మార్గదర్శకత్వం అందిందా? భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పోలీసు శాఖ ఎలాంటి చర్యలు తీసుకోనుంది? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలి. పరీక్షల్లో విఫలమవడమే ఒక అధికారి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించలేడని నిరూపించదు. అయినప్పటికీ ఈ పరిణామాన్ని ఒక హెచ్చరికగా తీసుకుని కారణాలను నిష్పక్షపాతంగా పరిశీలించడం అవసరం. ప్రజల భద్రతతో ముడిపడిన పోలీసు శిక్షణలో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనం పెరిగినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి. శిక్షణార్థులకు మరో అవకాశం కల్పించడం ఎంత ముఖ్యమో, శిక్షణా వ్యవస్థలోని లోపాలుంటే వాటిని గుర్తించి సరిదిద్దడం కూడా అంతే ముఖ్యం. ఈ అంశంపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర సమీక్ష చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

## అల్లు అర్జున్ అభిమానులకు గుడ్‌న్యూస్.. 'ఏఏ23'పై లోకేశ్ కనగరాజ్ కీలక అప్‌డేట్!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా 'ఏఏ23'పై ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. ఈ ప్రాజెక్టు ఆగిపోయిందంటూ ఇటీవల ప్రచారం జరగ్గా.. దర్శకుడు లోకేశ్ తాజా పోస్టుతో ఆ ఊహాగానాలకు తెరదించారు. త్వరలోనే ఆసక్తికరమైన వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు. లోకేశ్ కనగరాజ్ సోమవారం తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అల్లు అర్జున్‌తో మాట్లాడుతున్న ఫొటోను పంచుకున్నారు. "ఆసక్తికరమైన అప్‌డేట్స్ త్వరలోనే వస్తున్నాయి" అంటూ క్యాప్షన్ జత చేశారు. దీంతో ఈ సినిమాపై అభిమానుల్లో మళ్లీ అంచనాలు పెరిగాయి. అల్లు అర్జున్, లోకేశ్ కనగరాజ్ తొలిసారి కలిసి పనిచేయనున్నట్లు ఈ ఏడాది జనవరిలో అధికారికంగా ప్రకటించారు. ఆ సందర్భంగా విడుదల చేసిన వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. అందులో ఓ సింహం స్థిరంగా నిలబడగా.. దాని చుట్టూ కొన్ని నక్కలు తిరుగుతూ ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తాయి.

# ప్రపంచ దేశాలు స్పందించాలి

**మోడీ అరాచకాలను అరికట్టాలి**

**దేశంలో జరుగుతున్న కిరాయి గుండాలదాడికి బాధ్యులు ఎవరు**

**ఫారం 6కు అనుమతులు ఎక్కడ లభించాయి**

**ఆర్ఎస్ఎస్ గుండాల దాడులు కేంద్ర ప్రభుత్వం చేయిస్తున్నవే**

**జాతీయ ఎన్నికల సంఘం దేశం వైపా బిజెపి వైపా**

**జాతీయ ఎన్నికల కమిషన్ పై భగ్గుమంటున్న దేశ ప్రజలు**

**ప్రపంచ దేశాలన్నీ భారతదేశ పాలనను ప్రశ్నించాలి**

**జ్ఞానేష్ కుమార్ ను ప్రశ్నిస్తే బిజెపికి ఎందుకింత మంట కలుగుతుంది**

**తప్పులు జరగనప్పుడు కేంద్ర ప్రభుత్వం శ్వేత పత్రం ఎందుకు విడుదల చేయడం లేదు**

**ప్రజలను వేధిస్తూ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడం బిజెపికి కొత్తేం కాదు**

**భేటీ పడావో బేటి బచావో అంటే విద్యార్థినిలపై పిడి దెబ్బల దాడి చేయడమా**

**మత రాజకీయాలు ఇంకింతకాలం**

**దేశాన్ని నాశనం చేస్తున్న దరిద్రపు పాలనను అంతం చేయాల్సిందే**

**మోడీ క్రూరత్వాన్ని దేశంపై చూపిస్తున్నాడు**

**ప్రజల ఉసురు పోసుకుంటే పాపం తాకదా**

**ముసలోళ్ల రాజ్యంలో మునిగిపోతున్న దేశం**

**డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

దేశంలో జరుగుతున్న నిరంకుశ పాలనను ఎండగట్టాలని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు.ప్రజల హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలపై దాడులు చేయిస్తుందని మండిపడ్డారు.ప్రజలకు రావాల్సిన హక్కులను ప్రసాదించకుండా ప్రజాభివృద్ధికి వ్యతిరేక పరిపాలన కొనసాగిస్తూ 12 సంవత్సరాలుగా దేశ ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న సందర్భంలో దేశ ప్రజలు వాళ్ళ జీవితాలను బాగు చేసుకోవాలనే పరిస్థితిలో అంధకార వ్యవస్థలు అనుభవిస్తున్నారని బాధపడ్డారు.దేశ ప్రజల్ని పాలిస్తున్న బిజెపి ప్రభుత్వానికి పేద ప్రజల గోడు ఏమాత్రం వినిపించడం లేదని పేద ప్రజల కష్టాలు ఏమాత్రం కనిపించడం లేదని కేవలం బిజెపి పార్టీ అనుకూల వర్గాలకు మాత్రమే అన్ని విధాలుగా సహాయపడుతూ న్యాయం చేస్తూ దేశంలోని ఇతర ప్రజలను చిత్రహింసలు పెడుతుందని హెచ్చరించారు.ప్రపంచ దేశాల్లో భారతదేశం ముఖచిత్రాన్ని దినదినాన్ని దిగజారిస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశంలో లోపల జరుగుతున్న పోరాటాలకు భారత సైన్యాన్ని కేంద్ర బలగాలను ఢిల్లీ పోలీసులను వేల సంఖ్యలో మోహరింపజేస్తూ దేశ యువతను అణిచివేసే కుట్రలు చేస్తుండడం దేశ పాలనలో చేతగానితనాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. 10 అక్టోబర్ 2026న ఢిల్లీ ప్రధాన ఉద్యమ కేంద్రమైన జంతర్మంతర్ ప్రాంతంలో జరిగిన మహాధర్నాకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి అశేష స్పందన లభ్యమవ్వగా భారతదేశంలోని మేధావులను ఉద్యమకారులను దేశ రక్షకులను ప్రజాస్వామ్య వాదులను భారత రాజ్యాంగ రక్షకులను అతి భయంకరంగా వేధిస్తూ దిమాక్ నక్సల్స్ అంటూ అర్బన్ నక్సల్స్ అంటూ దేశ ప్రజలను విచ్ఛిన్నం చేస్తూ దేశాన్ని పాలిస్తూ సబ్బండ వర్గాలను సర్వనాశనం చేసే ప్రయత్నం చేస్తున్నారని హెచ్చరించారు.దేశంలోపల జరిగే ఉద్యమాల కోసం ఇన్నేసి కేంద్ర బలగాలను దింపడం ఒకెత్తైతే ఆర్ఎస్ఎస్ కు చెందిన గుండా బ్యాచ్ లను మఫ్టీ పోలీస్ ముసుగులో మఫ్టీ కేంద్ర బలగాల ముసుగులో మఫ్టీ ఢిల్లీ పోలీసుల ముసుగులో మేధావులను దాడులు చేయించడమే కాకుండా ఆడబిడ్డలను తాకరాని చోట తాగుతూ దాడులు చేయడం భరించడానికి వీలుగాని దెబ్బలు కొట్టడం దేశ చరిత్రను దిగజారుస్తున్నారని హెచ్చరించారు.ఒకవైపు బేటీ పడావో బేటి బచావో అంటూ నరేంద్ర మోడీ దేశానికి సాంకేతమిస్తూ అదే సందర్భంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో దాడులు చేయించడం బిజెపి పార్టీకే చెల్లుబాటు అవుతుంది అన్నారు.

**ప్రజాస్వామ్యంపై దాడి..**

దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యతను చేపట్టిన విద్యార్థి మేధావులను విచక్షణ రహితంగా దాడులు చేయడం వెనకాల ఆర్ఎస్ఎస్ గుండాల హస్తముందని ఢిల్లీ రోడ్డుపై జరుగుతున్న దాడులలో ఆర్ఎస్ఎస్ గుండాలు అమ్మాయిలను కొడుతున్న విధానాలు దేశ పరిధిలో కాకుండా ప్రపంచ దేశాలన్నీ చూసాయని వాటిపై వివిధ దేశాలలోని మేధావులు ఇప్పటికే స్పందిస్తుండగా మరోవైపు అబద్దాలకు ఆదర్శ పురుషులైన జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రధాని నరేంద్ర మోడీ హోం శాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలను దేశ న్యాయస్థానాలను వివిధ రాష్ట్రాల పాలకులను తప్పుదోవ పట్టిస్తూ ఆర్ఎస్ఎస్ రూపు రంగును ధరించి దేశాన్ని అధోగతి పాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.దేశాన్ని రక్షించుకునే క్రమంలో కాక్రోచ్ జనతా పార్టీ ప్రధాన నేతలను దేశ నియమాలకు విరుద్ధంగా ప్రపంచ దేశాల నియమాలకు విరుద్ధంగా హెలికాప్టర్లో అరెస్టు చేయడం ప్రపంచ దేశాల చట్టాలను కూడా గౌరవించలేని విధానాలను కేంద్ర ప్రభుత్వం పాటించిందని ఒకేరోజు అన్ని విధాలుగా ఉద్యమకారులపై దాడులు చేయడం ప్రధాన రైళ్ళను ఆపివేయడం,మెట్రో రైలు లను నిలిపివేయడం, ఢిల్లీలోని అన్ని ప్రధాన రహదారుల్లో పికెటింగ్స్ నిర్వహిస్తూ భారీ ఎత్తున భారీ గేట్స్ పెట్టినప్పటికీ లక్షలాది సంఖ్యలో పాల్గొన్న విద్యార్థి మేధావులను చూసి దేశ ప్రజలు నివ్వెరపోయారన్నారు.రాజకీయ పార్టీలు పిలుపునిస్తే కనీసం స్పందించని ప్రజలు దేశ రక్షణ కోసం జరుగుతున్న పోరాటంలో జంజీలకు,కాక్రోచ్ జనతా పార్టీ నాయకులకు భారత రాజ్యాంగ రక్షణ దారుడు రాహుల్ గాంధీకి తన సోదరి ప్రియాంక గాంధీకి సహకారంగా నిలుస్తున్న ఉద్యమకారులందరినీ,దేశ ప్రజలందరినీ దేశ యువతను అభినందించి తీరాలన్నారు.దేశంలో జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై జరుగుతున్న పోరాటం తీవ్రతరమైందని దానిని ఎవ్వరూ అడ్డుకోలేరనేది స్పష్టంగా తేలిపోతుందన్నారు.ప్రజలను వేధిస్తూ కోట్లాది ఓట్లను తొలగిస్తూ ఫారం నెంబర్ 6ను అడ్డం పెట్టుకొని బిజెపి ఏజెంట్గా పని చేసిన జ్ఞానేష్ కుమార్ పై ఇప్పటికే సుప్రీంకోర్టు న్యాయవాదులు పలు కేసులు వేయగా వాటిని తట్టుకోలేక బిక్కముఖం వేసుకున్న గణేష్ కుమార్ వాటి నుండి బయటపడడానికి తప్పుల మీద తప్పులు చేస్తూ అబద్దాల మీద అబద్దాలు ఆడుతూ న్యాయస్థానాలను చట్టాలను దేశ ప్రజలను మేధావులను అందర్నీ మోసగిస్తూ తనకు తిరుగులేదని నిరూపించుకునే క్రమంలో భాగంగా తనను తాను బలపరుచుకుంటున్నాడంటూ భావిస్తూనే దేశాన్ని పాడుచేస్తున్నాడన్నది మర్చిపోతున్నాడు అన్నారు.విద్యార్థులపై జరుగుతున్న దాడులను దేశంలో జరుగుతున్న పరిస్థితులను రాజకీయ కక్ష సాధింపులను విద్యార్థులపై అక్రమంగా బనాయిస్తున్న కేసులను ప్రపంచ దేశాలు పసిగడుతూ ప్రశ్నిస్తూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాజకాలను హోం శాఖ మంత్రి అమిత్ షా విద్యార్థులపై చేస్తున్న కఠినమైన దాడులను,జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కక్షతో చేస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక రాజ్యాంగ వ్యతిరేక జాతీయ ఎన్నికల కార్యాలయ వ్యతిరేక కార్యక్రమాలను వాటి క్రియలను కుట్రలను సవినయంగా పరీక్షిస్తూ పరిశీలిస్తూ దేశపాలకులను ప్రశ్నించడం కోసం, నిలదీయడం కోసం దేశ ప్రజలతో పాటు ఇతర దేశాలు సహకారాన్ని అందించాలని కోరుతున్నామన్నారు.

## ఘనంగా వైఎన్ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ రెండో వార్షికోత్సవం







**రెండేళ్ల ప్రస్థానంపై సంస్థకు అభినందనలు**

**రియల్ ఎస్టేట్ రంగంలో మరింత అభివృద్ధి సాధించాలి**

**నమ్మకం, నిజాయితీ, నాణ్యతే విజయానికి పునాది**

**ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని డాక్టర్ బరిగెల శివ ఆకాంక్ష**

**వేడుకల్లో పాల్గొన్న రాజా ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత**

**హైదరాబాద్, అక్టోబర్ 12 (జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో సేవలందిస్తున్న వైఎన్ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ రెండో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంస్థ అధినేత నరేందర్ గౌడ్ ఆహ్వానం మేరకు జై భీమ్ టీవీ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ రెండేళ్ల ప్రస్థానాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించి రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో నమ్మకం, నిజాయితీ, నాణ్యత, పారదర్శకత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వినియోగదారుల విశ్వాసాన్ని పొందుతూ నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చే సంస్థలకు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అన్నారు. సంస్థ అధినేత నరేందర్ గౌడ్ కృషి, పట్టుదలతో సంస్థను మరింత ముందుకు తీసుకెళ్లాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. రెండో వార్షికోత్సవం సందర్భంగా సంస్థ యాజమాన్యం, సిబ్బంది, కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజా ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్.ఎస్. రాజ్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మేధ, జై జాస్తి జంటగా మైత్రీ మూవీ మేకర్స్ కొత్త చిత్రం

**హీరోయిన్‌గా అరంగేట్రం చేస్తున్న నటుడు శ్రీకాంత్ కుమార్తె మేధ మేకా**

**జై జాస్తి హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో కొత్త చిత్రం**

**పృథ్వీ వనం దర్శకత్వంలో తెరకెక్కనున్న అందమైన ప్రేమకథ**

**త్వరలో టైటిల్ వెల్లడించనున్నట్టు ప్రకటించిన చిత్రబృందం**

టాలీవుడ్‌లో సీనియర్ నటుడు శ్రీకాంత్ కుమార్తె మేధ మేకా హీరోయిన్‌గా అరంగేట్రం చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. జై జాస్తి హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'మైత్రీ ఇన్ లవ్' అనే వర్కింగ్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. సోమవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. "వారితో మొదలై, మీ హృదయాల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే ప్రేమకథ ఇది" అనే వ్యాఖ్యతో ఈ పోస్టర్‌ను పంచుకుంది. ఇది ఒక అందమైన ప్రేమకథగా రూపుదిద్దుకోనుందని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి పృథ్వీ వనం దర్శకత్వం వహిస్తుండగా, మహేశ్ బాబు. పి క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కొత్త సినిమా టైటిల్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. కాగా, నేటి ముహూర్తం ఈవెంట్ కు టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నటుడు శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు. దర్శకురాలు నందినిరెడ్డి ముహూర్తం షాట్ కు క్లాప్ కొట్టారు.